నేటి కందం-నేటికి అందం

మొదటి స్వదేశీ టీకా
నదియై నతు లందుకొనుచు నాణ్యత తోడన్
తుది యత్నముగా కోళ్ళను
కుదిపెడి రోగమును మాన్పు కొరకై వచ్చెన్ !!

(కోళ్ళను కుదిపిన బర్డ్ ఫ్లూ మాన్పడానికి భారత దేశం టీకా ను తయారు చేయడంతో ప్రపంచంలో మన ప్రతిష్ట పెరిగింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

రైజింగ్ తెలంగాణ
రాష్ట్రంలో పెను మార్పు
చేస్తుందో లేదో ఇంకా
మాడకుండ ఎలా తీర్పు.
అస్తవ్యస్తమయ్యిందా
ఆరంభంలోనే అంతా
విపక్షాలు తొందరపడి
విమర్శిస్తే కాదా వింత

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 22-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:99 పేజీలు:6 వెల: రూ.1/-

ఇందిరమ్మ బీమా పథకానికి మార్గదర్శకాలు విడుదల..

హైదరాబాద్, నవంబర్ 21:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐకేజేబీపీ) లబ్ధిదారుల నమోదు ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రణాళికా శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నారు. ఒక్కో కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే, వారు ముందుగా ఎంపిక చేసుకున్న నామినీలకు రూ.5 లక్షల పరిహారం అందుతుంది. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునేందుకు కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

సమాజంలోని బలహీన వర్గాలకు ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇతర ప్రభుత్వ బీమా పథకాలను కొనసాగిస్తూనే, వాటన్నింటినీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అర్హులైన కుటుంబాలను గుర్తించి, వారి వివరాలను నమోదు చేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు.

18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉండాలి..

ప్రతి కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ఈ పథకంలో నమోదు చేసుకునే అర్హత ఉంటుంది. సాధారణంగా కుటుంబం ప్రకటించిన సంపాదించే వ్యక్తికి ప్రాధాన్యత ఇస్తారు. నమోదు చేసుకునే సమయానికి లబ్ధిదారుడి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు అర్హులుగా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారు. ఆధార్‌లో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉంటే, ఆ ఏడాది జూలై 1వ తేదీని పుట్టిన తేదీగా పరిగణిస్తారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా నమోదై ఉంటే, ముందుగా గుర్తింపు పొందిన ఆధార్ కేంద్రంలో సరిచేసుకున్న తర్వాతే పథకంలో నమోదు చేసుకోవాలి.

గ్రామ, వార్డు స్థాయిలో శిబిరాలు..

అర్హులైన కుటుంబాలు సులభంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులు నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన వార్డుల పరిధిలో శిబిరాలను ఏర్పాటు చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మార్గదర్శకాల్లో సూచించారు. ఎక్కువ కుటుంబాలు ఉన్న గ్రామ పంచాయతీలు, వార్డుల్లో అవసరాన్ని బట్టి అదనపు శిబిరాలు నిర్వహిస్తారు. శిబిరాల నిర్వహణకు సంబంధించిన వేదికలు, తేదీలు, బాధ్యతలు చేపట్టే అధికారుల వివరాలను ముందుగానే ఖరారు చేసి ప్రజలకు తెలియజేయాలి. నమోదు ప్రక్రియ, నామినీల వివరాల నమోదు తదితర అంశాలపై శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాలి. శిబిరాల్లో ప్రత్యేక కౌంటర్లు, కూర్చునేందుకు సౌకర్యం, తాగునీరు, విద్యుత్, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలి. నెల రోజుల పాటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆధార్, రేషన్ కార్డు తీసుకెళ్లాలి..

నమోదు శిబిరానికి వెళ్లే కుటుంబాలు ఆధార్ కార్డు, అందుబాటులో ఉంటే రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్‌ను తీసుకెళ్లాలి. రేషన్ కార్డు ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్న కుటుంబాలు తమకు కేటాయించిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దుకాణంలో ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. అదనపు పత్రాలు అవసరమైతే ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు అధికారికంగా సూచనలు జారీ చేస్తారు.

రేషన్ కార్డు నంబరునే దరఖాస్తు ఫారం నంబరుగా పరిగణిస్తారు. ఒక రేషన్ కార్డుపై ఒక దరఖాస్తుకు మాత్రమే అనుమతి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో జారీ చేసిన రేషన్ కార్డుల ఆధారంగానే నమోదు ప్రక్రియ చేపడతారు. ఇతర జిల్లాకు చెందిన రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు తమకు సమీపంలోని శిబిరంలోనే దరఖాస్తు చేసుకోవచ్చు. వారి వివరాలను సంబంధిత స్వస్థల జిల్లా నుంచి సేకరించి, అక్కడి అధికారులు పరిశీలిస్తారు.

నామినీలకు వాటాల కేటాయింపు..

నమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి వివరాలతోపాటు నామినీల పేర్లు, వారితో ఉన్న సంబంధం, వయస్సు లేదా పుట్టిన తేదీ వివరాలను నమోదు చేస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకుంటే, రూ.5 లక్షల పరిహారంలో ఒక్కొక్కరికి ఎంత శాతం వాటా ఇవ్వాలనే విషయాన్ని బీమా పొందే వ్యక్తి ప్రకటించాలి. ఈ వాటాలను పూర్తి సంఖ్యల్లో శాతాల రూపంలో నమోదు చేస్తారు. నామినీలందరికీ కేటాయించిన వాటాల మొత్తం 100 శాతానికి మించకూడదు.

నామినీల పేర్లను ఆన్‌లైన్ వ్యవస్థలో ఇప్పటికే నమోదై ఉన్న కుటుంబ సభ్యుల జాబితా నుంచి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. నామినీలలో ఎవరైనా 18 ఏళ్లలోపు మైనర్లు ఉంటే, వారి తరపున బీమా పరిహారాన్ని స్వీకరించేందుకు 18 ఏళ్లు నిండిన ఒక వ్యక్తిని అపాయింటీగా నమోదు చేయాలి. ఒకరి కంటే ఎక్కువ మంది మైనర్ నామినీలు ఉన్నా అనుమతిస్తారు. అపాయింటీగా ఎంపిక చేసే వ్యక్తి తప్పనిసరిగా కుటుంబ సభ్యుడే అయి ఉండాలన్న నిబంధన లేదు. నమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను కుటుంబ సభ్యులకు చూపించి ధ్రువీకరించుకోవాలి. కుటుంబం ఇప్పటికే ఇతర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా పొందుతున్న బీమా సౌకర్యాల వివరాలను కూడా దరఖాస్తులో నమోదు చేస్తారు. వివరాలను పూర్తిగా, కచ్చితంగా నమోదు చేయడంతోపాటు ఒకే కుటుంబం నుంచి పునరావృత దరఖాస్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నమోదు విజయవంతంగా పూర్తయిన ప్రతి లబ్ధిదారుడికి లావాదేవీ గుర్తింపు సంఖ్య (ట్రాన్సాక్షన్ ఐడీ)తో కూడిన రసీదు సందేశాన్ని పంపిస్తారు. ఒకసారి నమోదు చేసుకున్న వ్యక్తికి బీమా రక్షణ ప్రారంభమైన తేదీ నుంచి సంబంధిత పాలసీ సంవత్సరం ముగిసే వరకు పూర్తి బీమా రక్షణ ఉంటుంది.

నితీశ్ సేతు బ్రిడ్జిని ప్రారంభించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, నవంబర్ 21: ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లోని వైశాలి జిల్లాలో కచ్చీ దర్గా-రాఘవ్‌పూర్-బిదుపుర్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఆరు లేన్లు ఉన్న ఈ బ్రిడ్జికి బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ గౌరవార్థం 'నితీశ్ సేతు' అని పేరుపెట్టారు. బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ చౌధరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రిడ్జిని ప్రారంభించాక వారంతా మోదీతో కలిసి నడిచారు.

రూ.4,280 కోట్లతో నిర్మాణం

నితీశ్ సేతు బ్రిడ్జిని రూ.4,280 కోట్లతో గంగా నదిపై నిర్మించారు. పూర్తిగా కేబుళ్లతో దీనిని కట్టారు. దీని పొడవు 19.7 కిలోమీటర్లు. పట్నా జిల్లాలోని జాతీయ రహదారి 22పై ఉన్న కచ్చీ దర్గాను వైశాలి జిల్లాలోని జాతీయ రహదారి 322పై ఉన్న బిదుపుర్‌తో ఈ బ్రిడ్జి కలుపుతుంది. అంటే పట్నా, వైశాలిని ఇది అనుసంధానిస్తుంది. ఇందులో 9.7 కిలోమీటర్లు మెయిన్ బ్రిడ్జి కాగా.. 10 కిలోమీటర్లు అప్రోచ్ రోడ్లు ఉన్నాయి. ఈ బ్రిడ్జితో ప్రయాణ సమయం 20 నుంచి 25 నిమిషాలకు తగ్గుతుంది. ప్రముఖ సంస్థ లార్సెన్ అండ్ ట్యూబ్రో, దక్షిణ కొరియా కంపెనీ డైవూ కలిసి ఈ బ్రిడ్జిని నిర్మించాయి.

నితీశ్‌ను కలవడం ఆనందంగా ఉంది: మోదీ

నితీశ్ సేతు బ్రిడ్జిని ప్రారంభించేందుకు పట్నా ఎయిర్‌పోర్టు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ రిసీవ్ చేసుకున్నారు. నితీశ్‌ను కలవడం తనకు ఆనందంగా ఉందని మోదీ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఫొటోలు షేర్ చేశారు.

సంగారెడ్డి జిల్లాలో 11 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ.

సంగారెడ్డి, నవంబర్ 21(నేటి నిజం ప్రతినిధి):సంగారెడ్డి జిల్లాలోని హత్నూర, పటాన్‌చెరు, సంగారెడ్డి ఐటీఐలతో పాటు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవి కిరణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ విధానంలో 3 ఆఫీస్ సబార్డినేట్స్, 3 స్వీపర్, 3 వాచ్‌మన్ పోస్టులు, కాంట్రాక్ట్ విధానంలో 2 మల్టీ వర్పన్ వర్కర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.15,600/- వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ (బుధవారం) సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులతో పాటు స్వీయ ధ్రువీకరణ, అవసరమైన ధ్రువపత్రాలను జతపరచి సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని జి-బ్లాక్‌లో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు.

ఈ నెల 27వ తేదీన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన, విద్యార్హతల ధ్రువీకరణ, రాత పరీక్ష తదితర ప్రక్రియల ద్వారా అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

మరిన్ని వివరాలు, ఇతర సమాచారం కోసం సంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్.. త్వరలో ప్రారంభం



హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని గుర్తింపు కమిటీ నిర్ణయించింది.

ఈరోజు (శనివారం) మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో గుర్తింపు కమిటీ సమావేశమైంది. కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. ఇప్పటివరకు చేపట్టిన గుర్తింపు ప్రక్రియపై సమీక్ష జరిపారు. యూనివర్సిటీలు, కళాకారులు, నబ్బండ వర్గాలతో ఇప్పటికే జరిపిన సంప్రదింపులపై చర్చించారు. గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ఉద్యమకారుల గుర్తింపు కోసం రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు.

వెబ్‌సైట్‌ను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కమిటీ నిర్ణయించింది. వెబ్‌సైట్ ప్రారంభ గడువును ఖరారు చేసే అంశంపై సమావేశంలో చర్చించారు.

వెబ్‌సైట్ పురోగతిపై సమీక్షించేందుకు కమిటీ త్వరలో మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించింది. వెబ్‌సైట్ ప్రారంభ తేదీతో పాటు.. తదుపరి కార్యాచరణపై త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, శ్యాం మోహన్ పాల్గొన్నారు.

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ప్రమాదం.. ఒకదానికొకటి ఢీకొన్న నాలుగు కార్లు

హైదరాబాద్, నవంబరు 21: నగరంలోని రాజేంద్రనగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈకో పార్క్ సమీపంలో నాలుగు కార్లు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న వాహనాలు బ్లాస్టింగ్ పనుల కారణంగా రోడ్డుపై నిలిచిపోయాయి. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు ముందు ఉన్న కారును బలంగా ఢీకొట్టింది. దీంతో వరుసగా నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొని భారీగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో కార్లలో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులు కార్లలోనే ఇరుక్కుపోవడంతో వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు.

ఈ ప్రమాదంలో ఇద్దరికి కాళ్లు ఫ్రాక్చర్ కాగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను వెంటనే అంబులెన్సుల్లో సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు నాలుగు కార్లు ఢీకొనడంతో ఓఆర్ఆర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టడంతో క్రమంగా ట్రాఫిక్ పునరుద్ధరణ జరిగింది.

హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం..

పెయింట్ షాప్‌లో ఎగిసిపడ్డ మంటలు



హైదరాబాద్, నవంబర్ 21: నగరంలోని మియాపూర్ న్యూ హాఫీజ్‌పేటలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెయింట్ షాప్‌లో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు.. క్రమంలో రెండో అంతస్తులోకి వ్యాపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఫైరింజిన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షాపులో కెమికల్ పెయింట్‌లు ఉండటంతో పెద్దఎత్తున్న మంటలు ఎగిసిపడ్డాయి. అయితే ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ప్రమాదానికి గల కారణాలపై అగ్నిమాపక సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. రెండు అంతస్తుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని ఫైర్ సిబ్బంది గుర్తించారు. షాపు నిర్వహణకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఉన్నాయనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కొత్తగూడెం వర్శిటీని ప్రపంచంలోనే టాప్-5లో నిలుపుతాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21: కొత్తగూడెం మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సు ఏర్పాటు చేశారు. సింగరేణి, ఓయూ, కేయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును పూర్వ విద్యార్థులు - విద్యాసంస్థలు - పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి తుమ్మల ప్రసంగించారు. మైనింగ్ ఇంజనీరింగ్‌లో ఎంతో మంది నిపుణులు కొత్తగూడెం కాలేజ్ నుంచి వచ్చినవారే అని గుర్తుచేశారు. కొత్తగూడెంలో చదివిన పూర్వ విద్యార్థులు, విదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. విద్యారంగంలో తెలంగాణ ఖ్యాతి పెరిగేలా కొత్తగూడెం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్శిటీని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంతంలోనే ఈ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి చాలా ప్రోత్సహించారని.. అందుకే ఈ యూనివర్శిటీని ఖమ్మంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఖనిజాల కాణాచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని శాస్త్రీయంగా ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. మౌలిక సదుపాయాలు, ఆధునిక పరిశోధనల కోసం అత్యాధునిక ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంలోనే టాప్ ఫైవ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీల్లో కొత్తగూడెం యూనివర్శిటీని నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

కల్తీ కల్లు తయారీకి మత్తు పదార్థాల సరఫరా.. నిందితుడిపై పీడీ యాక్ట్!

మేడ్చల్, నవంబరు 21: కల్తీ కల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, మత్తు పదార్థాల అక్రమ సరఫరాకు పాల్పడుతున్న వ్యక్తిపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిద్దగొని రంగయ్య (45)పై పీడీ యాక్ట్ అమలు చేశారు. క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ సరఫరా కేసుల్లో రంగయ్య కీలక నిందితుడిగా ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.

మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో 25 కిలోల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాచారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ అతడిపై మరో కేసు నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆల్ప్రజోలం సరఫరాకు సంబంధించి కూడా కేసు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పిల్లాయిపల్లి గ్రామంలోని తన స్వగృహం నుంచే రంగయ్య మత్తు పదార్థాల అక్రమ సరఫరా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

వరుసగా మత్తు పదార్థాల అక్రమ సరఫరా కేసుల్లో నిందితుడిగా ఉన్న రంగయ్యపై పీడీ యాక్ట్ అమలు చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆదేశించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు అతడిపై నమోదైన కేసుల వివరాలు.. నేరాలకు సంబంధించిన ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. వాటిని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ చేశారు.

బాధ్యత గల భారతీయ యువత నిర్మాణంలో ఎన్‌సిసి కృషి

(22 నవంబర్ "ఎన్‌సిసి దినోత్సవం" సందర్భంగా)

హెచ్. ఎన్. కుంజ్రూ కమిటీ సిపార్సుల ఆధారంగా 15 జూలై 1948న పార్లమెంట్‌లో 31వ చట్టం ద్వారా 38,500 యువ కెడెట్లతో ప్రారంభమైన నేషనల్ కెడెట్ కోర్స్(ఎన్‌సిసి) లేదా జాతీయ యువసైనిక దళం గత 76 ఏండ్లుగా నేడు 20 లక్షల మంది యువతకు ఎన్‌సిసి శిక్షణనిస్తూ దేశ యువతను సుశిక్షితులను చేయడంలో ఘన విజయాలు నమోదు చేసుకుంటూ నేడు 22 నవంబర్ 2026న (నవంబర్ నాలుగవ ఆదివారం రోజున) 78వ "ఎన్‌సిసి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన యువభారతంలో నేటి యువతకు అవసరమైన క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవానిరతి, దేహదారుఢ్యం, సార్వ్ క్రీడల స్ఫూర్తి పెంపొందించడం, యువతను త్రివిధ దళాల పట్ల ఆకర్షించడం, మానసిక వికాసం, బాధ్యతగల పౌరుల నిర్మాణం లాంటి ఉత్తమ గుణాలు అలవడే విధంగా నిర్దిష్టమైన కార్యాచరణ అమలు చేస్తూ నేడు ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫామ్ ధరించే యువశక్తిగా ఎన్‌సిసి అందరి మన్ననలు పొందడం హర్షదాయకం. "ఏకత - క్రమశిక్షణ" లేదా "యునిటీ అండ్ డిసిప్లైన్" అనే నినాదంలో ముందుకు సాగుతున్న ఎన్‌సిసిలో ఆర్మీ, నావీ, ఏయిర్ ఫోర్స్ అనే త్రివిధ యువదళాలు ఉన్నాయి.

ఎన్‌సిసి మహోన్నత లక్ష్యాలు:

ప్రతి ఏట నవంబర్ మాసం నాలుగవ ఆదివారం రోజున, అనగా 22 నవంబర్ 2026న దేశవ్యాప్తంగా 78వ జాతీయ యువ సైనిక దళం దినోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఎన్‌సిసి శిక్షణ, పాఠ్యాంశాల్లో త్రివిధ దళాల పరిచయం, దేశ మిలటరీ చరిత్ర, యుద్ధ నైపుణ్యాలు, దేశ సమగ్రత, ఆయుధాల శిక్షణ, సాయుధ కవాతులు, జాతీయ సమైక్యత ప్రాధాన్యం, మత సామరస్యం, లౌకిక వాదం, పర్యావరణ పరిరక్షణ, ప్రథమ చికిత్స, యుద్ధనీతి లాంటి అనేక అంశాల్లో బోధనతో పాటు శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ పొందిన యువతకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఏ, బి, సి అనే పత్రాలను అందజేస్తారు. ఈ సర్టిఫికెట్లు పొందిన యువతకు పలు ప్రభుత్వరంగ సంస్థలు కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శిక్షణలు కల్పిస్తారు.

ఎన్‌సిసి విస్తరణ:

ఢిల్లీ ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న ఎన్‌సిసిలో దేశవ్యాప్తంగా 17 డైరెక్టరేట్లు, 96 ఎన్‌సిసి గ్రూపులు, 684 ఆర్మీ యూనిట్లు, 69 నావల్ యూనిట్లు, 61 ఎయిర్‌ఫోర్స్ యూనిట్ల ద్వారా పాఠశాల (8,9,10 తరగతులు), కళాశాల(11, 12, డిగ్రీ, పిజీ)లకు చెందిన ఎంపిక చేసిన విద్యార్థినీవిద్యార్థులకు శిక్షణ సేవలను అందుతున్నాయి. ఆర్మీ యువతకు ఖాకీ, నావల్ కెడెట్లకు తెలుపు, ఏయిర్‌ఫోర్స్ కెడెట్లకు స్కై బ్లూ రంగు యూనిఫామ్ డ్రస్సులు ఉంటాయి. శిక్షణలో భాగంగా విద్యాలయాల్లో తరగతులు/కవాతులు, శిబిరాల ద్వారా ఆయుధ శిక్షణలు, యూత్ ఎక్సఛేంజ్ పథకాలు లాంటి పలు అంశాలు అమలు పరుస్తారు. నేడు కేంద్ర ప్రభుత్వం చొరవతో గతంలో 14 లక్షల కెడెట్ల నుంచి ప్రస్తుతం 20 లక్షల కెడెట్లకు శిక్షణలు ఇస్తూ, రానున్న రోజుల్లో 30 లక్షల వరకు పెంచడానికి దశాబ్దకాల ప్రణాళికలు అమలు పరుస్తున్నారు.

ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్‌సిసి:

నేడు తెలంగాణ/ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఎన్‌సిసి సేవలు హైదరాబాదు కేంద్రంగా ఎన్‌సిసి జైరెక్టరేట్ నాయకత్వంలో ప్రతి ఏట 1.4 లక్షల మంది కెడెట్లు శిక్షణ పొందుతున్నారు. తెలంగాణలో 4 ఎన్‌సిసి గ్రూపులు, ఆంధ్రలో 5 గ్రూపులతో 67 ఎన్‌సిసి బెటాలియన్లు శిక్షణలో నిమగ్నం అయ్యాయి. ప్రతి విద్యార్థికి ఎన్‌సిసి శిక్షణను విధిగా నేర్పించాలనే వాదం ఎంతో కాలంగా వినిపిస్తున్నది. దీనిని వాలంటరీ సంస్థగా కాకుండా కంపల్సరీ శిక్షణగా నేటి యువతకు దేశభక్తిని నూరి పోయాల్సి ఉందనే వాదనలు సర్వత్ర వినిపిస్తున్నాయి. కొన్ని దేశా?? విద్యా విధానంలోనే ఇలాంటి శిక్షణలను సెలబస్‌గా అమలు చేయడం, డిగ్రీ తర్వాత కొంత కాలం పాటు తప్పనిసరిగా సైన్యంలో పని తేయడం అమలు జరుగుతున్న విషయాలను మరువరాదు. ఒక అమాయక యువకుడు లేదా యువతిని బాధ్యతగల ఆకర్షణీయ వ్యక్తిత్వం కలిగిన పౌరుడిగా తీర్చి దిద్దడంలో ఎన్‌సిసి చేస్తున్న కృషిని ప్రస్తుతిద్దాం, మన పిల్లలకు ఎన్‌సిసి శిక్షణను తప్పనిసరి చేద్దాం.



-మధుపాళీ
9949700037

గ్రామీణ ప్రాంతాలలో సంస్థాగత టాయిలెట్ల పనితీరును, లభ్యతను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పనితీరుపై సమీక్ష

న్యూ ఢిల్లీ, నవంబర్ 21:ప్రపంచ టాయిలెట్ దినోత్సవం-2026 సందర్భంగా నిన్న 'స్వచ్ఛ్ శౌచాలయ్-గరిమామయ్ భవిష్య' (ఎన్ఎస్‌జీబీ) ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు. దీనిని స్వచ్ఛ్ భారత్ మిషన్ (గ్రామీణ్) లిఎస్‌బీఎమ్(జీ)రి కార్యక్రమంలో భాగంగా జల శక్తి మంత్రిత్వశాఖ ఆధీనంలోని తాగునీరు, పారిశుధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) మొదలుపెట్టింది. ఈ ప్రచార ఉద్యమాన్ని, దీని పురోగతిని వివరించే మాడ్యూల్‌ను ఎస్‌బీఎమ్(జీ) లోని డీడీడబ్ల్యూఎస్‌కు చెందిన సంయుక్త కార్యదర్శి, జాతీయ మిషన్ డైరెక్టరు ఐశ్వర్య సింగ్ ఎలక్ట్రానిక్ మాధ్యమం సహాయంతో ప్రారంభించారు (ఈ-లాంచ్).

కార్యక్రమం మొదట్లో డీడీడబ్ల్యూఎస్ డిప్యూటీ సెక్రటరీ స్వాగతోపన్యాసాన్ని ఇచ్చారు. ఏ నేపథ్యంలో ఈ ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నదీ కూడా వివరించారు. అనంతరం డీడీడబ్ల్యూఎస్ డైరెక్టరు స్వచ్ఛ్ భారత్ మిషన్ (గ్రామీణ్) పురోగతిని గురించి సంక్షిప్తంగా తెలియజేశారు. దీనిలో భాగంగా దాదాపు 89.9 శాతం గ్రామాల్లో ఆరుబయలు ప్రాంతాలలో మల మూత్రాదుల విసర్జన రహిత స్థితి.. ఓడీఎఫ్ ప్లిఓపెన్ డెఫికేషన్ ఫ్రీ రిపోర్ట్స్ (నమూనా) దశకు చేరుకోవడమే కాకుండా, స్వచ్ఛ్ భారత్ మిషన్ (గ్రామీణ్)కు చెందిన ఇతర విభాగాల్లో ప్రగతిని కూడా ప్రస్తావించారు.

దీని తరువాత 'స్వచ్ఛ్ శౌచాలయ్-గరిమామయ్ భవిష్య' (ఎన్ఎస్‌జీబీ) ప్రచార ఉద్యమాన్ని సంయుక్త కార్యదర్శి, జాతీయ మిషన్ డైరెక్టరు ఐశ్వర్య సింగ్ ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ప్రచార కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్న విధానాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వివరించేందుకు డీడీడబ్ల్యూఎస్ రూపొందించిన ఒక మాడ్యూలును కూడా ఆమె ప్రారంభించారు.

'సురక్షిత టాయిలెట్ల సమాన భవిష్యదవకాశాలు' అంశాన్ని ప్రపంచ టాయిలెట్ దినోత్సవం-2026కు ఇతివృత్తంగా ఐక్యరాజ్యసమితి ఎంపిక చేసింది. ఇది పారిశుధ్యాన్ని లైంగిక సమానతతో జోడిస్తుంది. ఇదే విషయాన్ని 'స్వచ్ఛ్ శౌచాలయ్-గరిమామయ్ భవిష్య' (ఎస్ఎస్‌జీబీ) ప్రచార ఉద్యమంలో స్ఫూర్తిగా తీసుకుని, గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెడతారు. మరీ ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు, దివ్యాంగజనుల అవసరాలను నెరవేర్చే అంశంపై శ్రద్ధ వహిస్తారు.

'స్వచ్ఛ్ శౌచాలయ్- గరిమామయ్ భవిష్య' (ఎస్ఎస్‌జీబీ) ప్రచార ఉద్యమం లక్ష్యాలు ఇలా ఉన్నాయి: -

సీఎన్‌సీలు (కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు), సంస్థాగత టాయిలెట్ల (పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ ఘర్ మొదలైనవి) స్థితిని మదింపు చేయడం, అవసరాలను పరిగణనలోకి తీసుకుని మరమ్మతులు, నిర్వహణ, పునరుద్ధరణ పనులు చేపట్టడం. సంస్థాగత టాయిలెట్ల విషయంలో ఈ పనులను సంబంధిత అధికార సంస్థల (ఎస్ఎమ్‌సీ, ఏడబ్ల్యూసీ, జీపీకే, జీపీబీ వగైరా) ద్వారా పూర్తి చేయడం. అవసరమైన చోట్ల, వేరు వేరు కుటుంబాల వారిని తమ ఐహెచ్‌హెచ్‌ఎల్‌ల (వ్యక్తిగత కుటుంబ మరుగుదొడ్లు) మరమ్మతు, నిర్వహణ చేపట్టేటట్లుగా ప్రోత్సహించడం.

వల్లెలకు అవసరమయ్యే టాయిలెట్ రకాలను రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు సాధ్యమైనంత వర మదింపు చేసి, గుర్తించడానికి గాను సింగిల్-పిట్ టాయిలెట్‌ను ట్విన్-పిట్ టాయిలెట్‌గా తగిన మార్పులు చేయడం, సోక్ పిట్ లేనటువంటి సెప్టిక్ ట్యాంకును సోక్ పిట్‌ను కలిగివుండే సెప్టిక్ ట్యాంకుగా మార్చడం.

అవసరమైన మేరకు గాని లేదా ఎఫ్ఎస్ఎమ్ (ఫీకల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్) నియమ పాలన దృష్ట్యా గాని యంత్రాల సహాయంతో రొంపి వెలికితీత పనులను మదింపు చేసి, తదనుగుణంగా పథక రచన చేయడం.

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు, సంస్థాగత టాయిలెట్లను నిర్వహణకు తోడ్పడే ఓ అండ్ ఎమ్ వ్యవస్థల మదింపు, వాటిని బలోపేతం చేయడం.

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు, సంస్థాగత టాయిలెట్లను స్థానిక కుడ్య చిత్రకళ, సైన్‌బోర్డులతో, పరిసర ప్రాంతాల్లో వాతావరణాన్ని మెరుగుపరిచి, వాటిని చూడముచ్చటగా తీర్చిదిద్ది, ఆకర్షణీయంగా ఉండే మార్పుచేర్పులను చేయడానికి ప్రాధాన్యం ఇవ్వవలసిందంటూ ఆయా ప్రాంతాల నివాసులను ప్రోత్సహించడం. ఇదే విషయమై, వేరు వేరు కుటుంబాలను కూడా తమ వ్యక్తిగత కుటుంబ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకొనేటట్లు వారికి సూచనలు చేయడం.

పల్లెలో ఆరుబయలు ప్రదేశాలలో మల మూత్రాదుల విసర్జన రహిత స్థితి (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) ఎంత పక్కాగా ఉన్నదీ మదింపు చేయడం, చైతన్య ప్రబోధక కార్యక్రమాలను నిర్వహిస్తూ పౌరుల ప్రవర్తనా సరళిలో చెప్పుకోదగిన మార్పు చోటు చేసుకునేటట్లు వారు క్రమం తప్పక టాయిలెట్లను ఉపయోగిస్తుండేలా ప్రోత్సహించడం, తద్వారా 'ఓడీఎఫ్' స్థితిని పరిరక్షించడం.

గ్రామాలు, గ్రామ పంచాయతీలలో 'స్వచ్ఛ సేవా ఆకలన్' (ఎస్ఎస్ఏ) ఏ విధంగా ఉందీ మదింపు చేయడం, ఒకవేళ ఇది అప్పటికే పూర్తి కాలేదంటే గనక 2026 నవంబర్ 30 కల్లా ఎస్ఎస్ఏను పూర్తి చేసేటట్లు జాగ్రత్త చర్యలు తీసుకోవడం. ఎస్ఎస్ఏ ఈసరికే దాఖలు చేసి ఉంటే గనక గుర్తించిన లోటుపాట్లను సరి చేయడానికి ఇకపై తీసుకోవాల్సిన నిర్ణయాలేమేమిటో చర్చించడం.

స్వచ్ఛతకు ఇవ్వవలసిన ప్రాధాన్యం, వ్యక్తిగతంతోపాటు సామాజిక స్వచ్ఛతను పరిరక్షించడం, చేతులను సబ్బుతో కడుక్కుంటూ ఉండటం, ఎఫ్ఎన్ఎమ్ నియమాలను పాటించడంపై శ్రద్ధ తీసుకోవడం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నియమావళి-2026ను ఆచరణలో పెట్టడం, నాలుగు రకాల చెత్తను సేకరించడం, స్వచ్ఛ సేవా ఆకలన్ సహా వివిధ విషయాలపై అవగాహన కలిగించడం, వాటిలో భాగంగా మహిళలు, విద్యార్థినులు, దివ్యాంగజనుల అవసరాల పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడం వంటి అంశాలు సహా వివిధ విషయాలపై ప్రజలలో చైతన్యాన్ని పెంపొందింపచేయడం.

దీనికి తరువాయిగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఒక చర్చా కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి. ప్రచార ఉద్యమానికి కార్యరూపాన్ని ఇవ్వడం కోసం తాము ఏయే పథకాలను అమలు చేయవలసి ఉంటుందో ఈ సందర్భంగా వివరించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, సిక్కిం, కర్నాటకల స్వచ్ఛ్ భారత్ మిషన్ ((గ్రామీణ్) బృందాలు ఈ ప్రచార ఉద్యమం కోసం తాము ఏయే కార్యకలాపాలను చేపట్టాలని నిర్ణయించుకున్నది తెలియజేశాయి.

ఈ-లాంచ్ కార్యక్రమంలో స్వచ్ఛ్ భారత్ మిషన్ (గ్రామీణ్) సంయుక్త కార్యదర్శి, జాతీయ మిషన్ డైరెక్టరు ఐశ్వర్య సింగ్ మాట్లాడుతూ, 'స్వచ్ఛ్ శౌచాలయ్-గరిమామయ్ భవిష్య' (ఎస్ఎస్‌జీబీ) ప్రచార ఉద్యమాన్ని అందరికీ గౌరవం, అందరి ప్రయోజనాల కోసం ఉద్దేశించిన స్వచ్ఛత అన్న ఆదర్శవాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని రూపొందించారన్నారు. రాబోయే కాలంలో స్వచ్ఛతా పరిరక్షకులుగా పాఠశాల విద్యార్థినులను తీర్చిదిద్దడానికి ఎస్ఎస్‌జీబీ ప్రచార ఉద్యమం ప్రాధాన్యాన్ని ఇస్తుందని ఆమె అన్నారు. స్వచ్ఛత, పారిశుధ్యం, స్వస్థతలపై దృష్టి సారించాలని వారికి బోధిస్తుందన్నారు. టాయిలెట్లను స్వచ్ఛంగా ఉంచాలనీ, అవి అందరికీ అందుబాటులో ఉండేటట్లు చూడటంలో సమాజం భాగస్వామ్యం పంచుకొనేటట్లు ప్రోత్సహిస్తుందనీ తెలిపారు.

ప్రచార ఉద్యమంలో పాఠశాల నిర్వహణ సంఘాలు, సంబంధిత విభాగాలతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల స్వచ్ఛ్ భారత్ మిషన్ (గ్రామీణ్) బృందాలు సమన్వయాన్ని ఏర్పరుచుకొని పనిచేయాలని కూడా ఎస్‌బీఎమ్ (జీ) సంయుక్త కార్యదర్శి, జాతీయ మిషన్ డైరెక్టరు ఐశ్వర్య సింగ్ పిలుపునిచ్చారు. దీనిలో బడి పిల్లలు పాల్గొనేటట్లు చూడాలని సూచించారు. స్కూల్ పారిశుధ్య ఆడిట్ ప్రక్రియ ఈ ప్రచార ఉద్యమంలో ఓ భాగమన్నారు. దేశంలోని పర్యటక ప్రాంతాలు సహా ఎక్కువ మంది ప్రజలు సందర్శించే స్థలాలలో స్వచ్ఛతకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని చెప్పారు. ఈ పరిసరాలు పర్యాటకులకు సమగ్ర అనుభవాన్ని ఇస్తాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు పరోక్షంగా తోడ్పాటును కూడా అందించగలుగుతాయని ఆమె అతెలిపారు.

ఈ-లాంచ్ కార్యక్రమం ముగింపు ఘట్టంలో.. సంపూర్ణ స్వచ్ఛత కోసం ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, దీనిని ఒక విజయవంతమైన ఉద్యమంగా మార్చడానికి వివిధ ఆసక్తిదారు వర్గాలు ఇందులో పాలుపంచుకోవడానికి ముందుకు వచ్చేటట్లు చూడాలని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు విజ్ఞప్తి చేశారు.

బకాయిల కోసం రైతుల ఎదురుచూపులు..

యాసంగి సీజన్‌లో సొంత డబ్బులతో గన్నీ సంచుల కొనుగోలు
మొక్కజొన్న డబ్బులు చెల్లించినా..
సంచుల బకాయిలపై మార్క్‌ఫెడ్ మౌనం!



ఆదిలాబాద్, నవంబర్ 21: గత ఏడాది యాసంగి సీజన్‌లో మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్ అధికారులు కొంతమంది రైతులకు గన్నీ సంచుల డబ్బులు ఇవ్వటివరకు చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఊహించని విధంగా మొక్కజొన్న దిగుబడి రావడంతో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలు, ఇతర కొనుగోలు కేంద్రాల ద్వారా పంట కొనుగోలు చేవట్టింది. మొక్కజొన్నకు క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన మొక్కజొన్నను నాణ్యత, ప్రమాణాల ప్రకారం పరిశీలించి తూకం వేసేవారు. ఇందుకోసం అవసరమైన గన్నీ సంచులను మార్క్‌ఫెడ్ కాంట్రాక్టర్ ద్వారా రైతులకు అందించాల్సి ఉండేది.

అయితే ఊహించని విధంగా పంట దిగుబడి రావడంతో రైతులు ఒకేసారి కొనుగోలు కేంద్రాలకు మొక్కజొన్న తీసుకురావడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. గన్నీ సంచుల కొరతతోపాటు కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు ట్రాక్టర్ల ద్వారా మొక్కజొన్న బస్తాలను తరలించడం సమస్యగా మారింది. దీంతో ఈ సమస్యను అధిగమించేందుకు రైతులే సొంతంగా గన్నీ సంచులు సమకూర్చుకోవాలని, ఒక్కో సంచికి రూ.21.80 చొప్పున మొక్కజొన్న డబ్బులతోపాటు చెల్లిస్తామని అప్పట్లో మార్క్‌ఫెడ్ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో కుంటాల, కల్లూర్‌తోపాటు మండలంలోని వివిధ గ్రామాల రైతులు సొంతంగా గన్నీ సంచులు కొనుగోలు చేసి మొక్కజొన్నను విక్రయించారు. మొక్కజొన్న డబ్బులను దశలవారీగా చెల్లించిన నంత గన్నీ సంచుల బకాయిలను మాత్రం ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బకాయిలు చెల్లించాలని కోరుతూ సుమారు 15 రోజుల క్రితం ప్రజావాణిలో స్థానిక నాయకులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

మండలవ్యాప్తంగా గన్నీ సంచుల లెక్కల్లో భారీగా తేడాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని చోట్ల రైతులు సమకూర్చుకున్న గన్నీ సంచులకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.15 చెల్లించి, రూ.21.80 అందినట్లు రసీదులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల సంచుల లెక్కలు సరిపోలక బకాయిల చెల్లింపునకు ఆటంకం ఏర్పడినట్లు తెలుస్తోంది. గన్నీ సంచుల వ్యవహారంలో కొందరు చేతివాటం ప్రదర్శించినట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. మార్క్‌ఫెడ్ అధికారులు అందించిన సంచులు, రైతులు సొంత ఖర్చులతో కొనుగోలు చేసి తీసుకొచ్చిన సంచుల లెక్కలు తేలకపోవడంతో బకాయిల చెల్లింపులో జాప్యం జరుగుతోందని రైతులు అంటున్నారు.

ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నను యాసంగి సీజన్‌లో విక్రయించిన రైతులకు గన్నీ సంచుల డబ్బులు అందకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. బకాయిల కోసం సంబంధిత రైతులు నిత్యం సొసైటీలు, మార్క్‌ఫెడ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని, గన్నీ సంచుల డబ్బులు వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

384 బస్తాల మొక్కజొన్నను మార్క్‌ఫెడ్‌కు విక్రయించాను. గన్నీ సంచుల కోసం సుమారు రూ.9,216కు పైగా ఖర్చు చేశాను. సంచుల డబ్బులను తర్వాత బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెప్పారు. అనేక ఇబ్బందులు పడి ఒక్కో గన్నీ సంచిని రూ.25 నుంచి రూ.28 వరకు పెట్టి కొనుగోలు చేసి మొక్కజొన్న విక్రయించాం. మొక్కజొన్న డబ్బులను నెల రోజుల తర్వాత ఖాతాలో జమ చేశారు. మార్క్‌ఫెడ్ సంస్థకు మొక్కజొన్న విక్రయించినా, మాకు మాత్రం గన్నీ సంచుల బకాయిలు ఇప్పటివరకు అందలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

57వ ఇఫీలో సౌకర్యాల కల్పనకు, సమ్మిళితంగా మార్చడానికి స్వయంతో భాగస్వామ్యం కుదుర్చుకున్న ఎన్‌ఎఫ్‌డీసీ

న్యూఢిల్లీ, నవంబర్ 21:దివ్యాంగులు, నడవడానికి ఇబ్బందిగా ఉన్నవారితో సహా సినీ ప్రియులందరికీ 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)ను మరింత అందుబాటులోకి తెచ్చేందుకూ, సౌకర్యవంతంగా మార్చేందుకు స్వయం సంస్థతో జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇది రెండు సంస్థల మధ్య మూడో భాగస్వామ్యం. గతంలో 55వ ఇఫీ, 18వ ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఎంఐఎఫ్ఎఫ్) సమయంలో రెండు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఉత్సవం జరిగే వేదికల నిండిలోనూ సౌకర్యాలకు సంబంధించిన ఆడిట్‌ను సేవల భాగస్వామిగా స్వయం నిర్వహిస్తుంది. అవరోధాలను గుర్తించి సందర్శకులకు సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన, స్వతంత్ర ప్రవేశాన్ని అందించే చర్యలను సిఫారసు చేస్తుంది.

ఈ భాగస్వామ్యంలో భాగంగా దివ్యాంగుల అవసరాలు, సౌలభ్యంపై వేడుకలో వాలంటీర్లుగా పనిచేసే వారికి అవగాహన వర్క్‌షాప్‌లను కూడా నిర్వహిస్తున్నారు. గౌరవప్రదమైన సంభాషణ, అవసరమైన వారికి సాయం అందించడం, వైవిధ్యమైన అవసరాలు ఉన్నవారికి తోడ్పాటును అందించే ఆచరణాత్మక పద్ధతులపై ఈ అవగాహన కార్యక్రమాల్లో ప్రధాన దృష్టి సారిస్తారు.

దివ్యాంగులు, నడవడానికి ఇబ్బంది పడేవారు తమ రోజువారీ జీవితంలో ఎదుర్కొనే అడ్డంకులను సందర్శకులూ, వేడుక నిర్వాహకులూ ప్రత్యక్షంగా అనుభూతి చెంది అర్థం చేసుకునే అవకాశాన్ని యాక్సినబిలిటీ సిమ్యులేషన్ జోన్ అందిస్తుంది. అందరికీ అనువుగా ఉండే బహిరంగ ప్రదేశాల ప్రాధాన్యంపై మరింత అవగాహననూ, సానుభూతినీ, సరైన దృక్పథాన్నీ పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఈ భాగస్వామ్యం గురించి స్వయం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ స్మిను జిందాల్ వివరించారు. ''సౌలభ్యం అంటే కేవలం ర్యాంపులు నిర్మించడం లేదా భౌతిక ప్రదేశాలలో అడ్డంకులు లేకుండా చేయడం మాత్రమే కాదు. సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా, స్వతంత్రంగా, సమానంగా పాలుపంచుకునే అవకాశాన్ని కల్పించడం. సినిమా అనేది ప్రజలను ఏకం చేసే, హద్దులను చెరిపేసే, వైవిధ్య భరితమైన మానవ అనుభవాలను వేడుకగా నిర్వహించే ఒక శక్తివంతమైన మాధ్యమం. కాబట్టి చలనచిత్రోత్సవాలు అందరికీ సమానంగా స్వాగతం పలికేవిగా, అందరికీ అందుబాటులో ఉండేవిగా ఉండటం ఎంతో అవసరం. 57వ ఇఫీ కోసం ఎన్ఎఫ్‌డీసీ తో మేము కుదుర్చు కున్న భాగస్వామ్యం... బహిరంగ ప్రదేశాల ప్రాధాన్యంపై వేడుక అనుభవంలో సమ్మిళిత్వాన్ని కూడా అంతర్భాగంగా మార్చే దిశగా సాధించిన ప్రధాన విజయం. వయసు రీత్యా, తాత్కాలిక గాయం లేదా శాశ్వత వైకల్యం వల్ల ? నడవడానికి ఇబ్బంది ఉన్న కారణంతో ఏ ఒక్కరూ సినిమా ఆనందాన్ని పొందడానికి దూరం కాకూడదనేదే మా ఆకాంక్ష'' అని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యం గురించి ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ధీరజ్ సింగ్ మాట్లాడారు. ''సినిమా అనే సార్వత్రిక భాషా వేడుకను భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం నిర్వహిస్తోంది. ఈ ఉత్సవం అందరికీ అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యం. 57వ ఇఫీని సినీ ప్రేక్షకులందరికీ మరింత అందుబాటులోకి తీసుకువచ్చేలా, సమ్మిళిత్వం నిండినదిగా, సాదరంగా ఆహ్వానించేలా తీర్చిదిద్దే దిశగా సాధించిన విజయమే స్వయం సంస్థతో మేం కుదుర్చు కున్న భాగస్వామ్యం. అనువైన వేదికలు, సుశిక్షితులైన, అవగాహన కలిగిన వాలంటీర్ల ద్వారా ప్రతి ఒక్కరూ గౌరవంగా, సౌకర్యవంతంగా, స్వతంత్రంగా ఈ వేడుకలో పాల్గొనే వాతావరణాన్ని అందించాలన్నదే మా లక్ష్యం.

గంటలోనే అదృశ్యమైన బాలిక ఆచూకీ..

తల్లిదండ్రులకు అప్పగించిన నిర్మల్ పోలీసులు

ఆదిలాబాద్, నవంబర్ 21: జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక శుక్రవారం రాత్రి అదృశ్యమైంది. రాత్రి సుమారు 7.15 గంటల సమయంలో పాఠశాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో, ఆ పరిస్థితిని అదునుగా తీసుకున్న బాలిక పాఠశాల ప్రాంగణం నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ప్రహరీ గోడ సమీపంలోని పొదలు, మట్టి కుప్పల వెనుక దాక్కుంది.

బాలిక అదృశ్యమైనట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పాఠశాల సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టారు. గంటలోపే బాలికను గుర్తించి, ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పట్టణ సీఐ సమ్మయ్య నేతృత్వంలో బాలికను హాస్టల్ నిర్వహణ సిబ్బందికి అప్పగించారు. పోలీసులు బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు సమాచారం.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయం

నిబంధనల మేరకు దశలవారీగా సమస్యల పరిష్కారం

ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు



ఆదిలాబాద్, నవంబర్ 21: ఆదివాసీల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ, రాయికుంట గ్రామాల ఆదివాసీలతో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలకు అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలను నిబంధనల మేరకు దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెండు కల్వర్టుల నిర్మాణాలకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని ఆదివాసీలకు రేషన్ బియ్యాన్ని అక్కడే పంపిణీ చేసేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు.

అంతకుముందు గ్రామ సర్పంచ్ దినేష్ పవార్ ఆధ్వర్యంలో ఆదివాసీలు డప్పుల చప్పుళ్ల మధ్య బంతిపూలు చల్లుతూ పీఓకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈఈలు నందనవర్మ, చంద్రశేఖర్, ఎమ్మార్వై దుర్గం వెంకటేశం, ఏపీఓ రవీందర్, జీపీఓ సంతోషిమాత, కార్యదర్శి భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రింట్, డిజిటల్ రూపాల్లో విశ్వజనీన కథనాలు... : 57వ ఇఫి కోసం తిరిగి వచ్చిన 'ఇఫిలోయిడ్'

న్యూ ఢిల్లీ, నవంబర్ 21: గోవాలో 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి) ప్రారంభమైన సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్, ప్రముఖ సినీ దర్శకుడు అశుతోష్ గోవారికర్.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ప్రచురిస్తున్న రోజువారీ చలన చిత్రోత్సవ సమాచార పత్రిక (న్యూస్ లెటర్) 'ఇఫిలోయిడ్' అయిదో సంపుటి, తొలి సంచికను నేడు ప్రారంభించారు.

మరోసారి ఇఫి చిత్రోత్సవంలోకి అడుగుపెడుతున్న 'ఇఫిలోయిడ్'.. పాఠకులకు సినిమా ప్రపంచంలోని సందడిని, వైవిధ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించనుంది. సినిమాలను, దర్శకనిర్మాతలను, సినీ ప్రముఖుల ఆసక్తికర చర్చలను, మధురమైన జ్ఞాపకాలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ ఈ చిత్రోత్సవాన్ని ఒక అద్భుతమైన కథా వేదికగా ఆవిష్కరిస్తుంది.

ఈ న్యూస్ లెటర్‌లో చలన చిత్రోత్సవ ముఖ్య విశేషాలు, ఆసక్తికర కథనాలు, ఛాయాచిత్రాలు, కార్యక్రమాల షెడ్యూల్, కీలక ఈవెంట్లకు సంబంధించిన తాజా సమాచారం ప్రచురించనున్నారు. ప్రత్యేక సినిమా ప్రదర్శనలు, దర్శకులు, నటీనటులతో ముఖాముఖి సంభాషణలు, సినిమా ప్రదర్శనలు, ఇతర ఉత్సవ కార్యక్రమాల వరకు.. చలనచిత్రోత్సవం పొడవునా చోటుచేసుకునే విభిన్న అనుభవాలను 'ఇఫిలోయిడ్'లో పొందుపరచనున్నారు.

57వ ఇఫి ఇతివృత్తమైన 'విశ్వజనీన కథనాలు' స్ఫూర్తితో ఈ న్యూస్ లెటర్ రూపొందింది. ప్రజలు, సంస్కృతులు, విభిన్న దృక్పథాలను అనుసంధానించడంలో సినిమాకు ఉన్న శక్తిని చాటిచెప్పనుంది. చలన చిత్రోత్సవాన్ని కేవలం సినిమా ప్రదర్శన వేదికలకే పరిమితం చేయకుండా, సినీ ప్రియులు, పాఠకులు ఇఫిలో జరుగుతున్న తాజా పరిణామాలతో నిరంతరం అనుసంధానమై ఉండేలా చూడటం దీని లక్ష్యం.

నవంబర్ 20 నుంచి 29 వరకు చలనచిత్రోత్సవం జరిగే ప్రతిరోజూ 'ఇఫిలోయిడ్' ప్రచురితమవుతుంది. ఇఫిపై పీఐబీ అందించే అధికారిక సమాచారానికి అదనంగా, చలనచిత్రోత్సవ తాజా సమాచారం, ముఖ్య విశేషాలను సులభంగా చదివేలా, ఆకట్టుకునే దృశ్యరూపంలో అందించనుంది.

సృజనాత్మక ఆలోచనల నుంచి అంతర్జాతీయ అవకాశాల వరకు

న్యూ ఢిల్లీ, నవంబర్ 21: గోవాలోని తాజ్ సిడేడ్ ద గోవా హ్వారైజాన్‌లో వేవ్స్ ఫిలిం బజార్ 20వ ఎడిషన్ ప్రారంభ మయింది. భారత్, అంతర్జాతీయ చలన చిత్ర పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడంలో ఈ వేదిక రెండు దశాబ్దాలను పూర్తి చేసుకుంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ చలనచిత్ర అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) దీనిని నిర్వహిస్తోంది. అయిదు రోజుల పాటు నిర్వహించే ఈ మార్కెట్‌ప్లేస్‌లో ఫిలిం మేకర్లు, నిర్మాతలు, రచయితలు, పెట్టుబడిదారులు, పంపిణీదారులు, చిత్ర పరిశ్రమకు చెందిన ఇతర ప్రతినిధులు పాల్గొంటారు. సహకారాలను అన్వేషించే, సృజనాత్మక ప్రాజెక్టులను ప్రపంచ మార్కెట్‌లతో అనుసంధానించే వేదికగా ఇది పని చేస్తుంది.

ఈ సమావేశంలో ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ధీరజ్ సింగ్ స్వాగతోపన్యాసం చేశారు. గత రెండు దశాబ్దాలుగా భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి)తో ఫిలిం బజార్ సుదీర్ఘ అనుబంధాన్ని కలిగి ఉందన్నారు. ఈ ఉత్సవంలో ముఖ్యమైన భాగంగా ఫిలిం బజార్‌ను అభివర్ణించారు. ఇది ఇప్పుడు మరింత భారీగా, విస్తృతమైన వేదికగా రూపుదిద్దుకుందనీ, ఇది చిత్ర పరిశ్రమకు పెరిగిన అవకాశాలనూ, విస్తృత శ్రేణిలో భాగస్వామ్యాన్నీ అందిస్తోందని ఆయన తెలియజేశారు.

ఈ సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న 57వ ఇఫి ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీ అశుతోష్ గోవారికర్?. ఫిలిం బజార్ పోషిస్తున్న ప్రత్యేక పాత్ర గురించి వివరించారు. ఇది భారతీయ చిత్ర రూపకర్తలను, అంతర్జాతీయ స్థాయి చలన చిత్ర పరిశ్రమ నిపుణులను ఒక్కచోట చేరుస్తుందని తెలిపారు. ఒక సినిమా పూర్తయ్యే వరకు వేచి ఉండకుండా, చిత్రనిర్మాతల సృజనాత్మక ప్రయాణంలోని ప్రతి దశలోనూ వారికి మార్కెట్ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఒక చిత్రనిర్మాత వద్ద అసంపూర్ణమైన స్క్రిప్ట్ ఉన్నా లేదా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ఎదురుచూస్తున్న పూర్తయిన చిత్రం ఉన్నా... ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లడంలో సహాయపడగల వ్యక్తులతో అనుసంధానం అవ్వడానికి వేవ్స్ ఫిల్మ్ బజార్ అవకాశాలను అందిస్తుంది. కాఫీకి ఆహ్వానంతో ప్రారంభమయ్యే ఒక సాధారణ సంభాషణ కూడా అర్థవంతమైన సహకారాలకు ఎలా మార్గం సుగమం చేస్తుందో ఆయన వివరించారు.

సినిమాకు ఉన్న పరివర్తనాత్మక శక్తి గురించి శ్రీ గోవారికర్ వివరించారు. ప్రపంచాన్ని భిన్నంగా చూసే వీలును ప్రజలకు కల్పించడం వరమన్నారు. కొత్త వ్యక్తులతో పరిచయం పెంచుకోవడం, ఆలోచనలను పంచుకోవడం, ముఖ్యంగా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను ముందుకు తీసుకురావడం ద్వారా ఈ నాలుగు రోజుల మార్కెట్ ప్లేస్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రతినిధులను ప్రోత్సహించారు. అవకాశాలను వేగంగా అందిపు చ్చుకోవాలని, సాధ్యాసాధ్యాలను స్వీకరించేలా ఉండాలని సూచించారు. ప్రతి చర్చలోనూ 'అవును' అనే సమాధానమే లభిస్తుందనే ఆశతో ముందుకు సాగాలని ఆయన వారిని ప్రోత్సహించారు.

సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ కీలకోపన్యాసం చేశారు. ఫిలిం బజార్ సాధించిన వృద్ధి గురించి వివరించారు. 2007 లో 18 దేశాల నుంచి 204 మంది ప్రతినిధులు పాల్గొనడం దగ్గరి నుంచి ఇటీవల సంచికల్లో 2,500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొనే స్థాయికి చేరుకుందన్నారు. సృజనాత్మక దృక్పథాన్ని, వాణిజ్య అవకాశాలను అనుసంధానించే వేదికగా వేవ్స్ ఫిలిం బజార్‌ను అభివర్ణించారు.

వేవ్స్-2025లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్' దార్శనికత గురించి వివరించారు. భారతదేశ ప్రతిభను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడానికి, అంతర్జాతీయ సహకారంతో అవకాశాలను విస్తరించడానికి ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు.

ఫిల్మ్ బజార్‌ను సహకారానికి, నూతన ఆవిష్కరణలకు వేదికగా అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ నిర్మాతలు ఈ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆహ్వానించారు. ఇక్కడ కథలు భాగస్వామ్యాలుగా మారతాయని, సృజనాత్మకత చిరస్థాయిగా నిలిచే ఆర్థిక, సాంస్కృతిక విలువలుగా రూపాంతరం చెందుతుందని ఆయన అన్నారు.

కుడి నుంచి- ఎంఐబీ అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్, ఎన్ఎఫ్‌డీసీ చైర్మన్ జీ కృష్ణకుమార్, ఎంఐబీ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీ అశుతోష్ గోవారికర్, ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ధీరజ్ సింగ్

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్ వందన సమర్పణ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌డీసీ చైర్మన్ శ్రీ జి. కృష్ణకుమార్ కూడా పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలను పూర్తి చేసుకుంటున్న వేవ్స్ ఫిలిం బజార్... కేవలం సినీ పరిశ్రమ వర్గాలను ఒకచోట చేర్చడానికే పరిమితం కాకుండా పరస్పర సహకారానికి, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి అవసరమైన అవకాశాలను సృష్టించడం వరకు విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిర్మాతలు, రచయితలు, పెట్టుబడిదారులు, వంపిణీదారులతో చిత్ర రూపకర్తలను అనుసంధానించడం ద్వారా, ఆశాజనకమైన ప్రాజెక్టులకు సరైన భాగస్వాములు దొరికేలా చేయాలని, వైవిధ్యభరితమైన భారతీయ కథలు అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువయ్యే మార్గాలను రూపొందించాలని ఈ మార్కెట్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. సృజనాత్మక ఆలోచనలు అర్థవంతమైన భాగస్వామ్యాలుగా మారి, వెండితెరపై ఆవిష్కృతమయ్యే వేదికను అందించడం కొనసాగిస్తుంది.

విశ్వజనీన కథలు': భౌగోళిక, సామాజిక - సాంస్కృతిక హద్దులకు అతీతంగా ఇఫీ 57

న్యూఢిల్లీ, నవంబర్ 21: 57వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం (ఇఫీ) సందర్భంగా గోవాలోని పనాజీలో ఉన్న పీఐబీ మీడియా సెంటర్‌లో ఈ రోజు ఒక మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రోత్సవ డైరెక్టర్ శ్రీ అశుతోష్ గోవారికర్, జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ధీరజ్ సింగ్ పాల్గొన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) డైరెక్టర్ జనరల్ (పశ్చిమ) శ్రీమతి స్మితా వత్స శర్మ సమన్వయకర్తగా వ్యవహరించారు.

శ్రీ అశుతోష్ గోవారికర్ మీడియాతో మాట్లాడుతూ.. 'విశ్వజనీన కథలు (స్టోరీస్ విత వుట్ బోర్డర్స్)' ప్రధాన ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఇఫీ 57వ ఎడిషన్ విశేషాలను వివరించారు. కేవలం భౌగోళిక, ప్రాదేశిక సరిహద్దులకే పరిమితం కాకుండా.. కులం, సామాజిక వ్యత్యాసాలు, ఇతర సామాజిక-సాంస్కృతిక వాస్తవికతలు సహా కుటుంబాలు, సమాజాల్లో విభజనలకు అతీతంగా ఆలోచించడం కూడా ఈ ఇతివృత్తం పరిధిలోకి వస్తుందని ఆయన వివరించారు. అలాంటి అన్ని సరిహద్దులను అధిగమించి, విభిన్న సంస్కృతుల్లోని ఉమ్మడి మానవీయ అనుభవాలను ప్రతిబింబించే కథలన్నింటినీ ఒకే వేదికపైకి చేర్చడం ఈ వేడుక ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

ఈ చిత్రోత్సవంలోని వివిధ సినీ విభాగాలను ప్రస్తావిస్తూ... ఈ ఏడాది 'యానిమేషన్', 'డాక్యుమెంటరీ', 'సినిమా గురించి సినిమాలు' అనే మూడు కొత్త విభాగాలను ప్రవేశపెడుతున్నట్లు శ్రీ గోవారికర్ ప్రకటించారు. డాక్యుమెంటరీ చిత్రాలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రధానంగా ప్రస్తావించిన ఆయన.. డాక్యుమెంటరీ రూపకర్తలకు మరింత గుర్తింపునూ, అవకాశాలనూ కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ వేడుకలో భాగంగా.. ఇటీవల ముగిసిన ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవ (ఎంఐఎఫ్ఎఫ్) విజేతలు రూపుదిద్దిన చిత్రాలతో కూడిన ప్రత్యేక గాలా ప్రదర్శనను ఇఫీ నిర్వహించనుందని ఆయన తెలిపారు.

చిత్రోత్సవంలోని వైవిధ్యభరితమైన కార్యక్రమాల ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. పాత క్లాసిక్ చిత్రాల ప్రత్యేక ప్రదర్శనలు, ఎంపిక చేసిన చిత్రాల ప్రదర్శనలు, ప్రత్యేక ప్రదర్శనలు సహా సినిమా వైభవాన్నీ, వైవిధ్యాన్నీ ఆవిష్కరించడంలో ప్రతి విభాగమూ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మీడియా ప్రతినిధులు వ్యక్తిగత సినీ అభిరుచులకే పరిమితం కాకుండా ఇఫీలోని అన్ని అంశాలకూ ప్రాధాన్యమివ్వాలనీ, గాలా ప్రదర్శనలు, రెడ్ కార్పెట్ కార్యక్రమాలు, అంతర్జాతీయ మీడియా సమావేశాలు, పనోరమా ముఖాముఖి కార్యక్రమాలకూ హాజరు కావాలనీ కోరారు. సినీ రూపకర్తలు, సందర్శక ప్రతినిధులు తమ కృషిని ప్రపంచానికి చాటేందుకు ఇలాంటి వేదికలు దోహదపడతాయనీ, అంతేకాకుండా విభిన్న సినీ దృక్కోణాలను తెలుసుకునేలా ప్రేక్షకులకు ఉపయోగపడతాయనీ అన్నారు.

ఈ కార్యక్రమానికి విస్తృత ప్రాచుర్యాన్ని కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ గోవారికర్ అన్నారు. మీడియా ప్రతినిధులు తమ స్వతంత్ర అభిప్రాయాలనూ, విమర్శనాత్మక దృక్పథాన్నీ కొనసాగిస్తూనే.. పాత క్లాసిక్ చిత్రాల ప్రదర్శన సహా వివిధ విభాగాల సినిమాలను వీక్షించి కథనాలను ప్రసారం చేయాలని ఆయన కోరారు. ఇఫీ వేదికగా ప్రదర్శించే కథనాలు, సినీ విశేషాలను దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువ చేయడంలో మీడియా భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు.

ఈ వేడుక ఆద్యంతం చిత్రోత్సవ బృందం - మీడియా ప్రతినిధుల మధ్య అర్థవంతమైన, స్నేహపూర్వక ముఖాముఖి సమావేశాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మీడియా సిబ్బంది వృత్తిపరమైన బాధ్యతలు, పని ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని.. ఇఫీ కార్యక్రమాల కవరేజీకి వారికి మరింత వెసులుబాటు, తగినంత సమయం లభించేలా ఈ సమావేశాల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు.

57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవ అధికారిక బ్రోచర్‌ను కూడా ఈ సమావేశం సందర్భంగా శ్రీ అశుతోష్ గోవారికర్ ఆవిష్కరించారు.

ఇఫీ దార్శనికత, ప్రాధాన్యాలవారీగా కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించేలా ఈ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సినిమాకూ, సాంస్కృతిక ఆదానప్రదానాలకూ అంతర్జాతీయ వేదికగా 'ఇఫీ' పాత్రను మరింత సుస్థిరంగా నిలవడంలో మీడియా భాగస్వామ్యం, సమష్టి కృషి ప్రాధాన్యాన్ని ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

ధాన్యం కొనుగోలు సజావుగా సాగాలి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు..

కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కరీంనగర్, నవంబర్ 21:రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లర్ల వద్ద ఎదురయ్యే సమస్యలను కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు వెంటనే పరిష్కరించాలని సూచించారు.

రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. తేమ శాతం నిర్దేశిత ప్రమాణాలకు చేరుకున్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మంత్రి కోరారు.

భారత్‌లో నాలుగు కూనలకు జన్మనిచ్చిన బోత్స్వానా చీతా: దేశంలో 62కు పెరిగిన చీతాలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 21: బోత్స్వానా నుంచి తీసుకువచ్చిన రెండున్నరేళ్ల ఆడ చీతా కేపోఎం జీ-3 ఈ రోజు అటవీ ప్రాంతంలో నాలుగు ఆరోగ్యకరమైన కూనలకు జన్మనిచ్చింది. ఇది ప్రాజెక్ట్ చీతా, చీతాల సంతతిని పునరుద్ధరించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాల్లో ముఖ్యమైన విజయంగా నిలిచింది.

బోత్స్వానా నుంచి తీసుకువచ్చిన ఆడ చీతాల్లో కూనలకు జన్మనిచ్చిన తొలి చీతా కేపోఎం జీ-3 అని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమంలో వెల్లడించారు. సహజ వాతావరణంలో పిల్లలకు జన్మని వ్వడానికి ముందు ఆ చీతా నాలుగు నెలలకు పైగా అడవిలో ఉందని ఆయన చెప్పారు. 2022లో చీతాల పునరావాస కార్యక్రమం మొదలైన తర్వాత అటవీ ప్రాంతంలో ఇలా కూనలు పుట్టడం ఇది రెండోసారి.

ఈ నాలుగు కూనలు పుట్టడంతో భారతదేశంలో చీతాల సంఖ్య 62కి చేరిందనీ, వాటిలో 43 మన దేశంలో పుట్టినవేనని శ్రీ యాదవ్ తెలిపారు. 'ప్రాజెక్ట్ చీతా'కు ఇదొక చారిత్రక సందర్భమనీ, దేశంలో చీతాల సంతతిని పునరుద్ధరించడం ఘన విజయమనీ అన్నారు.ఇలా కూనలు పుట్టే ప్రతి సందర్భమూ ఆశలను బలపరు స్తుందనీ, వన్యప్రాణుల సంరక్షణ పట్ల నిబద్ధతను మరింత పెంచు తుందనీ మంత్రి అన్నారు. వన్య ప్రాణుల సంరక్షణకు సహనం, పట్టుదల, సమష్టి కృషి ఎంతో అవసరమని ఆయన మరోసారి స్పష్టం చేశారు. 'ప్రాజెక్ట్ చీతా' విజయం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్లు, పశువైద్యులు, క్షేత్రస్థాయి అటవీ సిబ్బందితో పాటు అందరి అంకితభావాన్నీ, నిబద్ధతనీ, కృషినీ ఆయన అభినందించారు.

వాణిజ్య ప్రధాన బొగ్గు గనుల వేలంపాటల్లో 16వ దఫాకు భారీ స్పందన.. 18 బొగ్గు బ్లాకులకు 85 బిడ్లు

న్యూఢిల్లీ, నవంబర్ 21:వాణిజ్య ప్రధాన బొగ్గు గనుల 16వ దఫా వేలంతో పాటు 15వ దఫా వేలంపాట రెండో పర్యాయానికి సంబంధించిన వేలంపాటకు లభించిన బిడ్లను బొగ్గు మంత్రిత్వశాఖకు చెందిన నామినేటెడ్ అథారిటీ ఈ రోజు తెరచింది. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 26 బ్లాకులకు వేలాన్ని నిర్వహించారు. 18 బొగ్గు బ్లాకులకు 85 బిడ్లు వచ్చాయి. ఈ ప్రతిస్పందన ఊహించిన దాని కన్న ఎక్కువగా ఉంది. ఇది ఇటీవలి విడతల్లో మిగతా రౌండ్ల నిష్టితో పోలిస్తే అధిక స్థాయిలో వ్యక్తమైన ప్రతిస్పందనల్లో ఒకటి.

ఆన్‌లైన్లో దాఖలైన బిడ్లను వేలందార్ల సమక్షంలో ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా తెరిచారు. ఆ తరువాత ప్రత్యక్షంగా అందిన బిడ్ దస్తావేజులున్న సీల్డ్ కవర్లను తెరిచారు. దీనిని దృశ్య మాధ్యమం ద్వారా ప్రదర్శించారు. ప్రతి విడతను పారదర్శకంగా నిర్వహించాలన్న ఆనవాయితీని మంత్రిత్వ శాఖ పాటిస్తోంది.

ఈ వరిణామం ఒక నిర్ణయాత్మక ఘటన అని చెప్పవచ్చు. 16వ విడతలో 17 బొగ్గు బ్లాకులకు 83 బిడ్లు వచ్చాయి. 15వ విడతకు సంబంధించి రెండో పర్యాయం ఒక బొగ్గు బ్లాకుకు 2 బిడ్లు అందాయి. వర్తమాన దఫాలో పోటీ బాగా పెరిగింది. 26 బ్లాకులలో 16 బ్లాకులకు అనేక బిడ్లు అందాయి. ఈ దఫాలో వాణిజ్య ప్రధాన బొగ్గు గని తవ్వకాల రంగంపై 20 మంది నూతన వేలందార్లు ఆసక్తిని కనబరిచారు. అంటే ఈ రంగం కొత్త పెట్టుబడిని, నూతన పాత్రధారులను నిరంతరం ఆకర్షిస్తోందని స్పష్టమవుతోంది.

ఆ భరోసా బలమైన పునాదులపైన ఆధారపడివుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేప్టివ్ బ్లాకులు, వాణిజ్య తరహా బొగ్గు గనుల నుంచి బొగ్గును వెలికితీయడం 10.22 శాతం మేర వృద్ధి చెంది, 210.46 మిలియన్ టన్నుల స్థాయికి చేరింది. ఆర్థిక వ్యవస్థలో బొగ్గుకు గిరాకీ అంతకంతకూ పెరుగుతున్న కొద్దీ భారతదేశానికి ఇంధన భద్రతను కల్పించడంలో బొగ్గు రంగానిది కీలక భూమిక అని తేలుతోంది. 2020 నాటి నుంచి, 15 విడతలలో 145 బొగ్గు గనులకు వేలం నిర్వహించారు. 44 కొత్త కంపెనీలు తెర మీదకు వచ్చాయి. ఈ గనులు ఏటా సుమారు రూ.47,500 కోట్ల రాబడిని ఇస్తాయని, దాదాపు 4.9 లక్షల ఉద్యోగావకాశాలను కల్పిస్తాయని భావిస్తున్నారు. వేలం ప్రేంవర్క్ దీనిని మరింత ఆకర్షణీయంగా మారుస్తోంది.. దీనిలో, ఫలానా కార్యకలాపాలకే బొగ్గును వినియోగించాలన్న ఆంక్షలంటూ లేవు. ఆటోమేటిక్ రూట్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)కి అవకాశం ఉంది. ముందస్తుగా చెల్లించవలసిన మొత్తమూ తక్కువగా ఉంది.

బహుళ విభాగాలు పాలుపంచుకొనే సాంకేతిక మూల్యాంకన సంఘం బిడ్లను పరిశీలించనుంది. సాంకేతికంగా అర్హతలు కలిగిన వేలందార్లను గుర్తించాక, ఎమ్ఎస్‌టీసీ వెబ్‌సైట్లో ఎలక్ట్రానిక్ పద్ధతిన నిర్వహించే తుది వేలం ప్రక్రియకు ఎంపిక చేస్తారు.

వాణిజ్య సరళి బొగ్గు గని తవ్వకం రంగం పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి దఫ దఫాకూ తీవ్రతరం అవుతున్నది. ప్రస్తుత విడతకు అసాధారణ ప్రతిస్పందన లభించడంతో 'ఆత్మనిర్భర్ భారత్' (స్వయంసమృద్ధి భారత్) లక్ష్య సాధనతో పాటు '2047 కల్లా వికసిత్ భారత్ దిశగా' (అభివృద్ధి చెందిన భారతదేశాన్ని 2047 కల్లా నిర్మిద్దాం) మన దేశం పయనించడంలో గనుల తవ్వకం రంగం కీలక పాత్రను హోషించనుందని స్పష్టమవుతోంది.



గంగా నదిపై నిర్మించిన ఆరు లైన్ల కేబుల్ ఆధారిత వంతెన 'నితీష్ సేతు'ను జాతికి అంకితం చేయనున్న ప్రధాని

న్యూ ఢిల్లీ, నవంబర్ 21:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 నవంబర్ 21న బిహార్‌లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు వైశాలి జిల్లాలోని నితీశ్ సేతును సందర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు వైశాలిలో సుమారు రూ.34,470 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, కొన్నింటిని జాతికి అంకితం చేయడంతో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ఆయన ప్రసంగిస్తారు.

రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రజలకు అందించే సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను చేపట్టారు. రోడ్డు అనుసంధానం, ఇంధనం, పట్టణ మౌలిక సదుపాయాలు, నీటి పారుదల, విద్య, వైద్యం, రవాణా తదితర కీలక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి.

గంగానదిపై ప్రత్యేక కేబుల్ సాంకేతికతతో నిర్మించిన వంతెన నితీశ్ సేతును ప్రధానమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. సుమారు రూ.4,280 కోట్ల వ్యయంతో ఈ వంతెనను నిర్మించారు. మొత్తం 19.7 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టు.. పాట్నా జిల్లాలోని ఎన్‌హెచ్-22పై ఉన్న కచ్చీ దర్గా నుంచి వైశాలి జిల్లాలోని ఎన్‌హెచ్-322పై ఉన్న బిదుపూర్‌ను అనుసంధానిస్తుంది. ఇందులో 9.7 కిలోమీటర్ల ప్రధాన వంతెనతో పాటు 10 కిలోమీటర్ల అనుసంధాన రహదారులు ఉన్నాయి.

గంగానదిపై మరో కీలక రహదారి మార్గంగా ఈ వంతెన ఉపయోగపడనుంది. ఇప్పటికే ఉన్న మహాత్మా గాంధీ సేతు, జేపీ సేతులపై వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు ఉత్తర, దక్షిణ బిహార్ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించనుంది. ముఖ్యంగా రఘోపూర్ దియారా ప్రాంత ప్రజలకు పాట్నాకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వైద్యం, విద్య వంటి అత్యవసర సేవలను పొందేందుకు వీలవుతుంది. వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువుల రవాణాకు కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది. మార్కెట్లకు చేరుకోవడాన్ని సులభతరం చేసి, ప్రాంతీయంగా వాణిజ్య కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా బిహార్ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడనుంది.

ప్రధానమంత్రి రూ.15,600 కోట్లకు పైగా విలువైన పలు కీలక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ప్రధాన రహదారి ప్రాజెక్టుల్లో ఎన్‌హెచ్-19లోని ఔరంగాబాద్-చోర్దాహా మార్గాన్ని ఆరు లైన్లుగా విస్తరించడం, ఎన్‌హెచ్-227ఎల్‌లోని చోర్మా-భైరాగనియా మార్గం, ఎన్‌హెచ్-327లోని ఉమాగావ్-సహర్సా అభివృద్ధి ప్రాజెక్టులు పనులు ఉన్నాయి.

విద్యుత్ రంగంలో 1,320 మెగావాట్ల బక్సర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో 660 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఇంధన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యుత్ పంపిణీ, ప్రసార మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభిస్తారు. వీటిలో రూ.1,130 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ఆర్‌డీఎన్ఎస్ నష్టాల తగ్గింపు పనులు తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. కాలువలు, గట్ల పునరుద్ధరణ, బలోపేతం చేసే పనులు, నవాడాలోని ఫుల్వారియా డ్యామ్ వద్ద తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టు, కహల్‌గావ్‌లో మురుగునీటి పారుదల మౌలిక సదుపాయాలు కూడా ప్రారంభించనున్న ఇతర ప్రాజెక్టుల్లో ఉన్నాయి. విద్యా సంస్థలు, గురుకుల పాఠశాలలు, వైద్య సేవలు, వ్యవసాయం, క్రీడలు, ప్రజా పరిపాలనకు సంబంధించిన భవనాలు, సదుపాయాలను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టులు సాగునీటి సదుపాయాలు, పట్టణ సేవలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడానికి దోహదపడతాయి.

సుమారు రూ.14,450 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో రూ.3,800 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న ఎన్‌హెచ్-139డ బ్లాక్‌లోని సాహెబ్‌గంజ్-అరేరాజ్-బెట్టియా మార్గాన్ని నాలుగు లైన్లుగా విస్తరించే ప్రాజెక్టు, సుమారు రూ.3,350 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పిర్‌పైంతి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (3 లీ 800 మెగావాట్లు) విద్యుత్ తరలింపు ప్రాజెక్టు ప్రధానమైనవి.

బేగుసరాయ్, బిహార్‌షరీఫ్, పూర్నియా, హాజీపూర్, వైశాలీహరి, దనాపూర్, ఖగారియా, నమస్తిపూర్, బోధ్‌గయ, సీతామఢి, సహర్సా తదితర పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. కాలువల వ్యవస్థల ఆధునికీకరణ, డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఐఐటీ పాట్నా పరిశోధన పార్కు, హాస్టల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యాసంస్థలు, అత్యవసర స్పందన వ్యవస్థ, పోలీసు డేటా కేంద్రానికి సంబంధించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా వీటిలో ఉన్నాయి.

రాష్ట్రంలో పర్యావరణహిత ప్రజా రవాణాకు మరింత ఊతమిస్తూ 100 పీఎం-ఈబస్సులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద లబ్ధి పొందిన 26,900 మందికి పైగా కుటుంబాలకు గృహప్రవేశ కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. పట్టణ కుటుంబాలకు ఇళ్లను అందించే కార్యక్రమంలో ఇది ఒక ముఖ్యమైన ప్రస్థానంగా నిలవనుంది.

రైతుల సౌభాగ్యాన్ని పెంచడంతో పాటు గ్రామీణ భారతాన్ని బలోపేతం చేస్తున్న పరివర్తనాత్మక కార్యక్రమాలపై వ్యాసం.. ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, నవంబర్ 21:కేంద్ర మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రజలతో పంచుకున్నారు. స్వదేశీ టీకా మందుల తయారీ గత 12 సంవత్సరాల్లో పశుగణాన్ని సాంక్రామిక వ్యాధుల నుంచి రక్షించడంలో ఏ విధంగా కీలక పాత్రను పోషిస్తున్నదీ మంత్రి తన వ్యాసంలో ప్రస్తావించారు. ఈ ప్రయత్నాలు పశువుల ఆరోగ్యాన్ని కాపాడటం, వ్యాధులతో వచ్చే నష్టాలను తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు రైతుల జీవన స్థాయిని మెరుగుపరచడానికి దోహదం చేశాయి.

స్వదేశీ టీకాలను రూపొందించడం పశువుల ఆరోగ్యసంరక్షణ రంగంలో భారత్ సామర్థ్యాలు విస్తరిస్తున్న ధోరణిని ప్రతిబింబిస్తోందనీ, అంతేకాక ఈ పరిణామం వ్యవసాయ రంగంలో దృఢ, స్వయంసమృద్ధ విస్తారిత అనుబంధ వ్యవస్థను నిర్మించడంలో భారత్ నిబద్ధతను కూడా చాటుతోందనీ శ్రీ మోదీ అన్నారు.

"గత 12 సంవత్సరాల్లో రైతు సోదరీ, సోదరుల సౌభాగ్యంతో పాటు గ్రామీణ భారత్‌ను శక్తిమంతమైందిగా తీర్చిదిద్దే దిశగా కూడా అనేక చరిత్రాత్మక నిర్ణయాలను తీసుకున్నారు. స్వదేశీ టీకాలను అభివృద్ధిపరచడంతో సాంక్రామిక వ్యాధుల నుంచి పశు, పక్ష్యాదులను సురక్షితంగా ఉంచడంలో ఏ విధంగా తోడ్పాటు లభిస్తోందో మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ తన వ్యాసంలో సమగ్రంగా వివరించారు. దీంతో రైతుల ఆదాయం వృద్ధి చెందడమే కాక, వారి జీవితాలు కూడా మెరుగుపడి, సౌలభ్యాన్ని సంతరించుకున్నాయి" అని పేర్కొన్నారు.

పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లో పీఎం పర్యటన

న్యూ ఢిల్లీ, నవంబర్ 21:నవంబర్ 21, 2026న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఉదయం సుమారు 9:45 గంటలకు ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవ వేడుకలకు హాజరవుతారు. ఈ సందర్భంగా అక్కడ ప్రసంగిస్తారు. అనంతరం బీహార్‌కు వెళ్తారు. వైశాలిలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తదనంతరం ప్రధానమంత్రి ఉత్తరప్రదేశ్‌కు చేరుకుంటారు. లక్నో గోమతి నగర్‌లోని ఇందిరాగాంధీ ప్రతిష్టాన్ వద్ద సాయంత్రం 5:30 గంటలకు 5వ కౌశల్ దీక్షాంత్ సమారోహ్ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగిస్తారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ వజ్రోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొంటారు. ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని తెలియజేసేలా 75 మంది విద్యార్థులతో ప్రధానమంత్రి సమావేశమవుతారు.

1951లో స్థాపించిన ఐఐటీ ఖరగ్‌పూర్? దేశంలోనే మొదటి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ. జాతీయ ప్రాధాన్యత గల సంస్థగా గుర్తింపు పొందింది. భారతదేశంలో సాంకేతిక విద్య, పరిశోధన, ఆవిష్కరణల పురోగతిలో ఇది మార్గదర్శక పాత్ర పోషించింది.

5వ కౌశల్ దీక్షాంత్ సమారోహ్‌లో ప్రధానమంత్రి పాల్గొంటారు. కౌశల్ దీక్షాంత్ సమారోహ్ 2021-22 విద్యా సంవత్సరంలో ప్రారంభమైంది. నైపుణ్యాభివృద్ధిలో ప్రతిభను గుర్తించేందుకు, నైపుణ్యం గల యువత శిక్షణ నుంచి ఉద్యోగ ప్రపంచంలోకి అడుగుపెట్టటాన్ని వేడుకగా జరుపుకునే వార్షిక జాతీయ వేదికగా ఇది నిలిచింది. ఈ వేదుక ప్రారంభమైనప్పటి నుంచి నైపుణ్యాభివృద్ధి రంగంలోని ఆలిండియా టాపర్లను, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సత్కరిస్తూ... వృత్తి విద్యా, నైపుణ్య ఆధారిత కెరీర్ల పట్ల గర్వం, విజయం, ఉన్నతాశయాల సంస్కృతిని పెంపొందిస్తోంది.

ఈ ఏడాది పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), జాతీయ నైపుణ్య శిక్షణా సంస్థలు (ఎన్ఎస్‌టీఐలు), ఇనిస్టిట్యూట్స్ ఫర్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (ఐటీఓటీలు) నుంచి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 52 మంది టాపర్లను సత్కరిస్తారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి -ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వరంగల్, నవంబర్ 21:వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సూచించారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఎంపీ కార్యాలయంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ఎంపీ డాక్టర్ కడియం కావ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు.

ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని చర్చించారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తూ, అర్హులైన ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. పట్టభద్రుల ఓటరు నమోదు నుంచి ఎన్నికల నిర్వహణ వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయడం, యువతతో పాటు విద్యావంతులను ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేయడంపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.

శాలువాలకు బదులు పుస్తకాలు బహూకరించండి

ఖమ్మం, నవంబర్ 21: సమాజంలో పుస్తక పఠన సంస్కృతిని మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఉందని ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ పిలుపునిచ్చారు. వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు శాలువాలు కప్పే సంప్రదాయానికి బదులుగా పుస్తకాలను బహూమతిగా అందించే విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పుస్తకాలను బహూకరించడం ద్వారా చదివే అలవాటును పెంపొందించడంతో పాటు విజ్ఞాన వ్యాప్తికి దోహదపడినవారమవుతామని పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు శుక్రవారం జిల్లా గ్రంథాలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ విద్యార్థులు, చిన్నారులు, ఉపాధ్యాయులు, పాఠకులను ఉద్దేశించి ప్రసంగించారు. పుస్తకాలు మనిషి జీవితానికి నిజమైన మార్గదర్శకాలన్నారు. జ్ఞానాన్ని అందించడంతో పాటు మంచి ఆలోచనా విధానాన్ని అలవర్చుకునేందుకు పుస్తక పఠనం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ తమ జ్ఞాన పరిధిని విస్తరించుకోవాలని సూచించారు. సమాజంలో విద్యాభివృద్ధికి, విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

శాలువాల కంటే పుస్తకాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే సంప్రదాయం రావాలని పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ ఆకాంక్షించారు. అతిథులకు పుస్తకాలను జ్ఞాపికలుగా అందించడం ద్వారా వారిలోనూ పఠనాసక్తి పెరుగుతుందని, ఆ పుస్తకాలు మరికొందరికి విజ్ఞానాన్ని పంచే సాధనాలుగా మారుతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ మంచి సంప్రదాయాన్ని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, సాహిత్య, విద్యా, సృజనాత్మక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, కళాకారులకు బహూమతులు అందజేసి అభినందించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ కార్పొరేటర్, సీనియర్ నాయకుడు కమర్తపు మురళి, సీనియర్ నాయకులు రావూరి సైదుబాబు, రాంబాబు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సజావుగా సాగాలి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు.. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కరీంనగర్, నవంబర్ 21:రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లర్ల వద్ద ఎదురయ్యే సమస్యలను కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు వెంటనే పరిష్కరించాలని సూచించారు.

రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. తేమ శాతం నిర్దేశిత ప్రమాణాలకు చేరుకున్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మంత్రి కోరారు

అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

భక్తిశ్రద్ధలతో స్వామివారి ఎదుర్కోలు.. భారీగా తరలివచ్చిన భక్తజనం కల్యాణోత్సవం అనంతరం మహా అన్నదానం

ఆదిలాబాద్, నవంబర్ 21:నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ 42వ వార్షికోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సమీప గ్రామాలు, పలు కాలనీల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. కల్యాణోత్సవానికి అవసరమైన అమ్మవార్ల పూసేలు, మట్టెలు, పట్టు వస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. మహిళల కోలాటాలు, భక్తి పాటలు, భజనలతో తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ చక్రపాణి వాసుదేవ ఆచార్యులు, స్థానాచార్యులు శ్రీమాన్ నరసింహమూర్తి, అర్చకులు నిమ్మగడ్డ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

స్వామివారికి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించగా, ఉత్సవంలో పాల్గొన్న మహిళలు ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిమంది మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనిక దంపతులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, హిందూ ఉత్సవ సమితి నాయకులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, కార్యదర్శి నిమ్మల రమేష్, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలిపై దాడిని ఖండించిన సీఐటీయూ

నిందితుడిని అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నల్గొండ, నవంబర్ 20: నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికురాలు చందుపట్ల రమణపై జరిగిన దాడిని ఖండిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోదాడ మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకట్ నారాయణ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు ఎండనక, వాననక నిత్యం ప్రజల కోసం శ్రమిస్తూ పట్టణాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారి శ్రమ వెలకట్టలేనిదని పేర్కొన్నారు. అలాంటి కార్మికులపై కొంతమంది వ్యక్తులు కారణం లేకుండా దాడులకు పాల్పడటాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

చందుపట్ల రమణపై దాడికి పాల్పడిన బాలకృష్ణ అనే వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలను బలోపేతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కోదాడ పట్టణ కన్వీనర్ ఎం. ముత్యాలు, యూనియన్ అధ్యక్షుడు కొమ్ము నాగేశ్వరరావు, మాతంగి నాగమణి, బెనర్జీ, దేవిక, దావణం, ముత్యాలమ్మ, కాంతమ్మ, వై. వెంకటేశ్వర్లు, కమలమ్మ, భద్రమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి యోగాతోనే ఉపశమనం

-యోగ పీఠాధిపతి జ్ఞానానంద గిరి మహారాజ్



ఆదిలాబాద్, నవంబర్ 21: యోగాభ్యాసంతో మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మజ్ఞాన భారత్ వ్యవస్థాపకుడు, గోకులం నాయక్‌పల్లి యోగపీఠం శంకరాచార్యుడు మహా అవతార్ జ్ఞానానంద గిరి మహారాజ్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్స్‌లో శనివారం బ్రహ్మజ్ఞాన యోగ విద్యా సంకల్ప సమాలోచన వేదిక ఆధ్వర్యంలో జాతీయస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జ్ఞానానంద గిరి మహారాజ్ ఆధ్వర్యంలో, నవాబ్‌పేట యోగ సత్యం, స్థానిక ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్ డైరెక్టర్ మగ్గిడి తిరుపతి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చిన్నవయసు నుంచే అనేక మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాభ్యాసాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించాలని, తద్వారా ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన, సంస్కారవంతమైన భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దవచ్చని అన్నారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే మహా సంకల్పం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఓంకార నాదం, ప్రార్థనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సమావేశంలో కరిమల జూనియర్ కళాశాల, లిటిల్ హాన్స్ రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

2014-15లో 760గా ఉన్న విశ్వవిద్యాలయాలు ఇప్పుడు భారతదేశంలో 1,400కు పైగా ఉన్నాయి: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, నవంబర్ 21: అంతర్జాతీయ అవగాహన, విద్యా నైపుణ్యం మరియు సమ్మిళిత విద్య పట్ల భారతదేశ నిబద్ధతకు సింబయాసిస్ ఒక ప్రతీక అని పర్ణిస్తూ, ఆయన ఇలా అన్నారు, "దాని పేరులోనే సహజీవనం, పరస్పర గౌరవం మరియు విభిన్న సంస్కృతులు, ఆలోచనలను ఒకచోట చేర్చడం ద్వారా కలిగే సుసంపన్నత ఇమిడి ఉన్నాయి." భారతదేశ నాగరికన్వార్తి అయిన 'వసుధైవ కుటుంబకం'ను ప్రస్తావిస్తూ, ఆయన ఇలా అన్నారు, "ప్రపంచం సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో, విద్య దేశాలు, సంస్కృతులు మరియు వర్గాల మధ్య వారధిగా మారాలి."

సింబయాసిస్ అంతర్జాతీయ విస్తరణను ప్రశంసిస్తూ, ఈ విశ్వవిద్యాలయం 2024లో దుబాయ్‌లో తన మొదటి అంతర్జాతీయ బ్రాంచ్ క్యాంపస్‌ను స్థాపించిందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు భారతదేశం మరియు యూఏఈ మధ్య విద్యా సంబంధాలను బలోపేతం చేస్తాయని, ప్రపంచ ఉన్నత విద్యారంగంలో భారత దేశ ఉనికిని పెంచుతాయని ఆయన అన్నారు.

2025-26 విద్యా సంవత్సరంలో సింబయాసిస్‌లో 62,000 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, వీరిలో భారతదేశం నలుమూలల నుండి 29,000 మందికి పైగా మహిళలు ఉన్నారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. 85 దేశాలకు చెందిన 3,000 మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులతో, ఈ విశ్వవిద్యాలయం సమ్మిళిత మరియు అంతర్జాతీయ విద్య పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు.

ఉన్నత విద్యారంగంలో మహిళల పెరుగుతున్న విజయాలను హైలైట్ చేస్తూ, దేశవ్యాప్తంగా జరిగిన స్నాతకోత్సవాలకు తాను హాజరైనప్పుడు, పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు డిగ్రీలు, పతకాలు అందుకోవడాన్ని నిరంతరం చూశానని ఆయన అన్నారు. "నా దృష్టిలో, ఇది నారీశక్తి పెరుగుతున్న బలానికి ఒక స్పష్టమైన సంకేతం. ఇదే నిజమైన మహిళా సాధికారత," అని ఆయన అన్నారు. వైద్య విద్యలో మహిళలకు అవకాశాలను విస్తరించడంలో ఒక ముఖ్యమైన అడుగుగా సింబయా సిస్ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్ స్థాపనను కూడా ఆయన అభినందించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత దిశగా భారతదేశం పురోగమిస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు. గత పన్నెండేళ్లలో ఉన్నత విద్యా గణనీయంగా విస్తరించిందని, విశ్వవిద్యాలయాల సంఖ్య 2014-15లో 760 నుండి నేడు 1,400కు పైగా పెరిగిందని ఆయన హైలైట్ చేశారు. ఐఐటీల సంఖ్య 16 నుంచి 23కు, ఐఐఎంల సంఖ్య 13 నుంచి 22కు, ఎయిమ్స్ సంస్థల సంఖ్య 8 నుంచి 23కు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యలో నమోదులు 2014-15లో 3.4 కోట్ల నుంచి 4.5 కోట్లకు పైగా విద్యార్థులకు పెరిగాయని ఆయన ఇంకా తెలిపారు.

బాధ్యతాయుతమైన ప్రపంచ భాగస్వామిగా భారతదేశ పాత్రను నొక్కిచెబుతూ, 160కి పైగా భాగస్వామ్య దేశాలలోని నిపుణులు, అధికారులకు ప్రయోజనం చేకూర్చే ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటీఈసీ) కార్యక్రమాన్ని ఉపరాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. 2014 నుంచి, గ్లోబల్ సౌత్ నుండి 30,000 మంది మహిళలతో సహా 80,000 మందికి పైగా నిపుణులు ఐటీఈసీ శిక్షణ ద్వారా ప్రయోజనం పొందారని ఆయన అన్నారు. "పరస్పర గౌరవం, సమానత్వం ప్రాతిపదికన భాగస్వామ్య దేశాలతో జ్ఞానం, నైపుణ్యాలు, నివుణతను పంచుకోవడాన్ని భారతదేశం గట్టిగా విశ్వసిస్తుంది," అని ఆయన అన్నారు.

యూపీఐ, ఇండియా స్టాక్ వంటి కార్యక్రమాలు ప్రపంచ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఆర్థిక నమ్మిళితం, సుపరిపాలనలకు భారతదేశం అందిస్తున్న పెరుగుతున్న తోడ్పాటును ప్రదర్శిస్తున్నాయని ఆయన అన్నారు. టాంజానియాలోని జాన్జిబార్‌లో ఉన్న ఐఐటి మద్రాస్ అంతర్జాతీయ క్యాంపస్, ఆఫ్రికాతో భారతదేశం యొక్క విస్తరిస్తున్న విద్యా, సాంకేతిక భాగస్వామ్యానికి మరో ఉదాహరణ అని ఆయన జోడించారు.

2023లో భారతదేశం జీ20 అధ్యక్షత వహించడాన్ని గుర్తుచేస్తూ, జీ20లో ఆఫ్రికన్ యూనియన్ శాశ్వత సభ్యురాలిగా చేరడాన్ని ఉపరాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రపంచ నిర్ణయాధికారంలో ఆఫ్రికా ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా చోటుచేసుకుంటున్న వేగవంతమైన సాంకేతిక మార్పులను ప్రస్తావిస్తూ, పట్టభద్రులు జీవితాంతం నేర్చుకోవడాన్ని అలవర్చుకోవాలని ఉపరాష్ట్రపతి కోరారు. "మీ డిగ్రీలు విలువైన పునాదులు, కానీ జీవితాంతం నేర్చుకోవడమే మీ గొప్ప ఆస్తి అవుతుంది," అని ఆయన అన్నారు.

విద్యార్థులు నిజాయితీతో కూడిన ఉన్నత ప్రమాణాలను సాధించాలని కోరుతూ, "వృత్తిపరమైన విజయం ముఖ్యం, కానీ వ్యక్తిత్వం, నైతిక ప్రవర్తనే శాశ్వతమైన గౌరవాన్ని సృష్టిస్తాయి," అని ఆయన అన్నారు. వ్యవస్థాపకత, పరిశోధన, ప్రజా సేవ, పరిశ్రమ, సామాజిక ఆవిష్కరణల ద్వారా దేశ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పట్టభద్రులకు పిలుపునిచ్చారు.

"దేశ నిర్మాణం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. ఇది పౌరులు, విద్యాసంస్థలు, వ్యాపారాలు మరియు సమాజాలు పాలుపంచుకునే ఒక సామూహిక కర్తవ్యం," అని ఆయన అన్నారు.

2026లో పట్టభద్రులయ్యే విద్యార్థులపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా భారతదేశం సాగిస్తున్న ప్రయాణంలో యువ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని ఆయన అన్నారు. వారు సహజీవన విలువలను నిలబెట్టాలని, సమాజానికి సేవ చేయాలని, తమ కుటుంబాలకు మరియు సంస్థలకు గర్వకారణంగా నిలవాలని ఆయన కోరారు.

ఉద్యోగాల కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలం

అమరావతి, నవంబర్ 21:కార్పొరేట్ పన్నులు తగ్గించిన ప్పటికీ దేశంలో ఆశించిన స్థాయిలో ఉద్యోగాల కల్పన జరగలేదని కాంగ్రెస్ విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి భార్గవ్ వల్లూరు విమర్శించారు. ఇప్పుడు ఉద్యోగాల అంశంపై మొసలి కన్నీరు కార్చడం ప్రధాని మోదీ రాజకీయ నాటకాలకు పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. అసలు కార్పొరేట్ పన్నులను ఎందుకు తగ్గించారు? ఆ నిర్ణయం ద్వారా లబ్ధి ఎవరికి చేకూరింది? దేశ యువతకు ఉద్యోగాలు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మోదీ పాలనకు కాలం చెల్లుతోందని, రాజస్థాన్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రజల మారుతున్న తీర్పునకు నిదర్శనమని భార్గవ్ వల్లూరు పేర్కొన్నారు. ఎన్ని రాజకీయ జిమ్మిక్కులు చేసినా ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదన్నారు. ఓట్ల చోరీ ఆరోపణలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీజేపీపై ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్టీపీసీ ఆర్ఎఫ్‌సీఎల్‌లో గ్యాస్ లీకేజీపై మాక్ డ్రిల్

పరిశ్రమల రెస్క్యూ బృందాలతో సహాయక చర్యల ప్రదర్శన
ఆకస్మికంగా పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



కరీంనగర్, నవంబర్ 21:రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని ఎన్టీపీసీ ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలో అమ్మోనియా గ్యాస్ లీకేజీ సంభవిస్తే చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర రక్షణ, సహాయక చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ, సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మాక్ డ్రిల్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో, సమర్థవంతంగా స్పందించకపోతే ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది అనుసరించాల్సిన విధానాలు, ప్రమాద తీవ్రతను నియంత్రించడం, బాధితులను సురక్షితంగా రక్షించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే మాక్ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వివిధ విభాగాల సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించే సామర్థ్యం పెరుగుతుందని సీపీ తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో ఉన్న లోపాలను ముందుగానే గుర్తించి, వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక పోలీసు యంత్రాంగం, పరిశ్రమల భద్రతా విభాగాలు, రెస్క్యూ బృందాలు, ప్రాజెక్టు నిర్వహణ సిబ్బంది మధ్య పరస్పర సమన్వయం మరింత బలోపేతం కావడానికి ఇటువంటి మాక్ డ్రిల్స్ ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని విభాగాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ఎన్టీపీసీ ఎస్ఐలు వెంకటస్వామి, ప్రవంతి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు, రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి

ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి
ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ పోటీల్లో ప్రతిభ చూపిన 20 మందికి ప్రశంసాపత్రాలు
-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

అమరావతి, నవంబర్ 21:ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, ఎన్నికల వ్యవస్థపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. యువతలో ఓటు హక్కుపై చైతన్యం పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను తెలియజేసేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా నిర్వహిస్తున్న వ్యాసరచన, క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారతదేశం ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించడానికి రాజ్యాంగం కీలకమని, ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలచే ఎన్నుకోబడే ప్రభుత్వమే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాతిపదిక అని వివరించారు. ప్రజల అభిప్రాయాలకు ప్రతినిధులుగా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అధికారం ఓటు ద్వారా లభిస్తుందని, అందువల్ల ప్రతి ఓటరు తన ఓటు విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల్లో ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎన్నో ఇబ్బందులను అధిగమించి ఓటు హక్కును వినియోగించుకుంటున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఓటింగ్ శాతం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, 17 ఏళ్ల వయస్సు నుంచే ముందస్తు ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రజల అవసరాలకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తే, వాటిని అర్హులకు చేరవేయడంలో ప్రభుత్వ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని వివరించారు.

భవిష్యత్తులో విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా ఏ రంగంలో ఉన్నా నమాజాభి వృద్ధి పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతి విద్యానంస్థ నుంచి ఇద్దరు విజేతలను ఎంపిక చేశారు.

అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వ్యాసరచన విభాగంలో 10 మంది, క్విజ్ విభాగంలో 10 మందిని ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వ్యాసరచన విభాగంలో 10 మంది, క్విజ్ విభాగంలో 10 మంది చొప్పున మొత్తం 20 మందిని జిల్లా స్థాయి విజేతలుగా ఎంపిక చేశారు. వారందరికీ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చదువులను నమ్మితేనే పేదరికం నుంచి విముక్తి



-డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,

హైదరాబాద్, నవంబర్ 21:పేదరికాన్ని జయించడానికి కావలసిన పదునైన ఆయుధం ఉన్నత విద్య మాత్రమే అని, చదువుల తల్లి సరస్వతి దీవిస్తే పేదరికం నుంచి విముక్తి లభిస్తుందని ప్రముఖ కవి, రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు సిద్ధిపేట జిల్లా దుబ్బాక పిఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేదరికమే చదువుకోవాలనే కసిని పెంచుతుందని, కనీసం డిగ్రీ వరకు ఉన్నత శ్రేణిలో విద్యాభ్యాసం చేసి అనుకున్న ఉద్యోగ ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయిలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడానికి క్రమశిక్షణతో కూడిన కృషిని చేయాలని అన్నారు. సక్రమమైన దినచర్య ఉన్న విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. పేదరికంలోంచి ధృవతారగా ఎదిగిన అబ్దుల్ కలాం లాంటి వారు మనకు ఆదర్శంగా నిలుస్తూ దారి దీపం వలె మార్గదర్శనం చేస్తున్నారని తెలిపారు.

వదవ తరగతి తర్వాత విద్యార్థుల జీవితం ఓ కొత్త మార్గాన్ని ఏర్పరచుకుంటుందని సవివరంగా చెప్పారు. మన భవిష్యత్తు మన చేతుల్లో ఉందని, మనల్ని మనకు పరిచయం చేసేది మనం పొందిన విద్య మాత్రమే అని తెలిపారు. విశిష్ట అతిథి జి నాగేశ్వర్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాన్ని కలిగి ఉంటూ సామాజిక మాధ్యమాలు, సినిమాలు, మాదకద్రవ్యాల పట్ల జాగరూకతతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా శిక్షకులు డా శ్రీనివాసాచారి చదువు అవసరాన్ని, తల్లితండ్రుల పాత్రను చక్కగా వివరించారు. సైకాలజిస్ట్ ఇంజనీర్ సత్య ప్రకాశ్ మాట్లాడుతూ చేతి రాత ద్వారా మన వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చని, జ్ఞాపకశక్తిని పెంపొందించే పలు టెక్నిక్స్‌ను యువతకు వివరించారు. శిక్షకులు చిరంజీవి మాట్లాడుతూ సంస్కార సమరదీక్ష అవసరాన్ని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్నం భూపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, నాగేశ్వర్‌లతో పాటు ఇతర శిక్షకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రాసిన క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్, వ్యాసతోరణం, కవితల పుస్తకాన్ని పాఠశాల లైబ్రరీకి బహూకరించారు.

ప్రమాణ స్వీకారానికి ముందే వైసీపీ కార్పొరేటర్ రాజీనామా!

అమరావతి, నవంబర్ 21:చిత్తూరు నగరపాలక సంస్థ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కనీసం ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే తన పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. నగరపాలక సంస్థ 7వ డివిజన్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ నాయకురాలు కట్టమంచి హరిణి రెడ్డి శనివారం తన రాజీనామా పత్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్‌కు అందజేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకుల ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండగా, ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియలో 51 డివిజన్లలో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో 7వ డివిజన్ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హరిణి రెడ్డి కూడా ఉన్నారు. మిగిలిన 9 డివిజన్లకు నవంబర్ 1న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 3న ఫలితాలు ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 7న విడుదల చేసిన అధికారిక రాజపత్రంలోనూ 7వ డివిజన్ నుంచి కట్టమంచి హరిణి రెడ్డి వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైనట్లు ప్రకటించింది. అయితే 7వ డివిజన్ ఏకగ్రీవ ఎన్నిక మొదటి నుంచీ వివాదాస్పదంగా మారింది. తమ అభ్యర్థుల నామినేషన్లను బలవంతంగా ఉపసంహరింపజేశారని, ఉపసంహరణ పత్రాలు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు చూపించి ఏకగ్రీవాలకు తెరతీశారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు, కుట్రల కారణంగానే పలు డివిజన్లలో ఏకగ్రీవాలు జరిగాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై చిత్తూరులో ఆందోళనలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో హరిణి రెడ్డి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు అందజేసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ఎం.సి. విజయానందరెడ్డి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 7వ డివిజన్ నుంచి నామినేషన్ దాఖలు చేసినట్లు వివరించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఎన్నికల అధికారి తనను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారన్నారు. అయితే ఈ ఏకగ్రీవం వెనుక తనకు గానీ, తమ పార్టీ నాయకులకు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తనపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని చిత్తూరు ప్రజలకు తెలియజేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. పదవి కంటే తనపై నమ్మకం ఉంచిన వార్డు ప్రజల విశ్వాసమే ముఖ్యమని పేర్కొన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పార్టీ అధిష్ఠానానికి, వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి, చిత్తూరు పార్టీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీకి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజాసేవే తన లక్ష్యమని, పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.

నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో ఏకగ్రీవాలపై మొదలైన వివాదం ఇప్పుడు ఎన్నికైన కార్పొరేటర్ రాజీనామా వరకు చేరడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థి ప్రమాణ స్వీకారం చేయకముందే పదవిని వదులుకోవడం చర్చకు దారితీసింది. ఏకగ్రీవ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ చేసిన ఆరోపణలు, ఆ పార్టీ చేపట్టిన నిరసనలు, తాజాగా హరిణి రెడ్డి తీసుకున్న నిర్ణయం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



భారతీయ మహిళా శాస్త్రవేత్తలకు శాశ్వత స్ఫూర్తి అసీమా చటర్జీ

భారత దేశంలో శాస్త్రవేత్తలందరిలో అసీమా చటర్జీ (1917?2006) ప్రత్యేక స్థానం పొందారు. మహిళలకు అనేక సామాజిక ఆంక్షలు ఉన్న కాలంలో, ఆమె చేసిన విశిష్ట కృషి శాస్త్ర రంగంలో అద్భుతాలను సాధించేందుకు మార్గదర్శకమైంది. రసాయన శాస్త్రం, ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీ మరియు ఫైటోమెడిసిన్ రంగాలలో ఆమె చేసిన కృషి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

అసీమా చటర్జీ 1917 సెప్టెంబర్ 23న పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపించిన ఆమె, కుటుంబ ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించ గలిగారు.

1936లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో బాచిలర్ డిగ్రీ (బి.ఎస్సీ.) అందుకున్నారు. 1938లో మాస్టర్ డిగ్రీ (ఎం.ఎస్సీ.) పూర్తిచేశారు. 1944లో అదే విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ (ఖష్ట్ర.ఆ.) పొందారు. ఆ రోజుల్లో భారతదేశంలో, ముఖ్యంగా మహిళలకు, శాస్త్రవేత్తలుగా ఎదగడం ఒక అపూర్వమైన విషయం.

ఆమె సంస్లేషిత కర్బన రసాయన శాస్త్రంలో వృక్ష ఉత్పత్తుల గూర్చి పరిశోధనలు చేశారు. ప్రఫుల్ల చంద్ర రే, ప్రొఫెసర్ ఎస్.ఎన్.బోస్ అధ్వర్యంలో పరిశోధనలు చేశారు. ఈమె 1940 లో కలకత్తా యూనివర్సిటీ యొక్క "లేడీ బ్రబోర్నే కాలేజి"లో చేరి రసాయన శాస్త్ర విభాగానికి అధిపతిగా ఉన్నారు. 1944 లో ఇండియా విశ్వ విద్యాలయంలో శాస్త్రీయ విజ్ఞానంలో డాక్టరేట్ పొందిన మొదటి మహిళగా నిలిచారు.


అసీమా చటర్జీ పరిశోధనలు ప్రధానంగా భారతీయ ఔషధ మొక్కలు, వాటి అల్కలాయిడ్లు మరియు వాటి ఔషధ గుణాలపై కేంద్రీకృతమయ్యాయి. ఆమె జీవితం మొత్తం రసాయన శాస్త్రంలోని సవాళ్లను ఎదుర్కొంటూ, సమకాలీన సమస్యల పరిష్కారానికి దోహదం చేసేందుకు అంకితం చేశారు.

వింకా మొక్కలలోని అల్కలాయిడ్లను ఉపయోగించి, క్యాన్సర్ చికిత్సలో ఉపయోగపడే కొన్ని ముఖ్యమైన ఔషధ సమ్మేళనాలను అభివృద్ధి చేశారు.

ఈ పరిశోధనలు గ్లోబల్ మెడికల్ రంగంలో క్యాన్సర్ కీమోథెరపీకి ప్రణాళికాత్మకంగా మారాయి.

మలేరియా వ్యాధిని నిరోధించడంలో ఆమె చేసిన

నవంబర్ 22...అసీమా చటర్జీ వర్ధంతి



కృషి విపరీతమైన ప్రాధాన్యతను పొందింది. భారతదేశంలో మలేరియా నివారణ కోసం రూపొందించిన కొత్త ఔషధాల్లో ఆమె కీలక పాత్ర పోషించారు.

మూర్ఛ రోగ రుగ్మత నివారణకు అవసరమైన ఔషధాలను తయారు చేయడంలో ఆమె గణనీయమైన కృషి చేశారు.

అసీమా చటర్జీ భారతదేశంలో లభించే మొక్కల ఔషధ గుణాలను విశ్లేషించడంలో విశేష కృషి చేశారు. ప్రత్యేకించి ఆయుర్వేద మరియు సంప్రదాయ ఔషధాల్లోని రసాయనాలను ఆధునిక శాస్త్రీయ పద్ధతులతో గుర్తించడంలో విశేషంగా శ్రమించారు.

భారతదేశంలో అసీమా చటర్జీకి ఇచ్చిన అత్యున్నత పౌర పురస్కారాల్లో పద్మభూషణ్ (1975) ఒకటి. భారతీయ శాస్త్రవేత్తలకు ఇచ్చే గౌరవప్రదమైన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు అవార్డు అందుకున్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సంస్థకు తొలి మహిళా అధ్యక్షురాలిగా పని చేసే గౌరవం లభించింది.

భారత జాతీయ సైన్స్ అకాడమీ (ఎఐఓం) సభ్యురాలిగా, దేశ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులకు మార్గ దర్శకురాలిగా నిలిచారు. అసెంబ్లీ ఆఫ్ నేషన్స్ మహిళా శాస్త్రవేత్తలలో ప్రముఖంగా నిలిచారు.

ఆ రోజుల్లో శాస్త్రరంగంలో మహిళలకున్న అవకాశాలు చాలా తక్కువ. అలాంటి పరిస్థితుల్లో అసీమా తన శక్తి సామర్థ్యాలను నిరూపించి, మహిళా శాస్త్రవేత్తలకు మార్గదర్శకురాలిగా నిలిచారు.

ఆయుర్వేద శాస్త్రంలో వాడే భారతీయ ఔషధ మొక్కలపై ఆధునిక పరిశోధనలు చేసి, వాటి ప్రయోజనాలను ప్రపంచానికి తెలియ జేశారు.

అసీమా తన జీవితమంతా శాస్త్రీయ పరిశోధన, విద్యాబోధన, మహిళా సాధికారతకు అంకితం చేశారు.

అసీమా చటర్జీ ఒక సాధారణ శాస్త్రవేత్త మాత్రమే కాదు; ఆమె భారతీయ శాస్త్రానికి శాశ్వతంగా స్ఫూర్తిగా నిలిచే వ్యక్తిత్వం. రసాయన శాస్త్రంలో ఆమె చేసిన కృషి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా, అనేకమంది యువతీ యువకులకు స్ఫూర్తిగా నిలిచింది. "మహిళగా ఉన్నా శాస్త్ర రంగంలో అగ్రగామిగా ఎదగవచ్చు" అని నిరూపించిన అసీమా జీవితం మహిళా శాస్త్రవేత్తలకు ఆదర్శం. కన్నవడితే ఏదైనా సాధించగలం అనే నమ్మకానికి ఆమె జీవితం ఒక తార్కాణం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

కరాటే క్రీడాకారుడు రేవంత్‌కు రూ.40 వేల ఆర్థిక సాయం

జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేయూత



కరీంనగర్, నవంబర్ 21: పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మాచర్ల రేవంత్ కుమార్‌కు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. ముదిరాజ్ జేఏసీ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రమేష్ కుమారుడైన రేవంత్, సీనియర్ కరాటే మాస్టర్ సురభి వేణుగోపాల్ వద్ద శిక్షణ పొందుతూ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహాయం అందించాలని ముదిరాజ్ 14 సంఘాల జేఏసీ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. జేఏసీ అధ్యక్షుడు చిక్కుడు రాజయ్య ఆధ్వర్యంలో నాయకులు గంగుల కమలాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేయగా, ఆయన స్పందించి రేవంత్‌కు రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జేఏసీ నాయకులు, కరాటే మాస్టర్ సురభి వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చల్ల హరి శంకర్, రెడ్డివేణి మధు, గూడెల్లి రాజకుమార్, పిట్టల శ్రీనివాస్, పండుగ శ్రీధర్, జేఏసీ ప్రధాన కార్యదర్శి నిమ్మల కిషన్, ఉపాధ్యక్షులు గడగల రాజయ్య, గుడ్డెలుగుల పోచయ్య, కార్యవర్గ సభ్యులు జట్టి బాలయ్య, కుంభం మల్లయ్య, కొత్తూరు రాజయ్య, 14 ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో వింటర్ గాలా సందడి

ఆటపాటలతో చిన్నారుల కోలాహలం
ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ పాఠశాలలో వింటర్ గాలా వేడుకలను చిన్నారులు ఉత్సాహంగా నిర్వహించారు. 'ఎ డే ఆఫ్ ఫన్, ఫ్రోలిక్ అండ్ ఫెస్టివిటీస్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం శీతాకాలపు ప్రత్యేక అలంకరణలతో ఆకట్టుకుంది. చిన్నారులు స్నోమ్యాన్ తయారీ, స్నోబాల్ టాస్, రింగ్ టాస్, స్నోఫ్లేక్ ఆర్ట్, హస్తకళలు, నృత్య ప్రదర్శనలు తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటల ద్వారా సృజనాత్మకత, శారీరక నైపుణ్యాలు, సామాజిక సంబంధాలు పెంపొందించుకోవచ్చని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా

ఆదిలాబాద్, నవంబర్ 21:ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలోని గొల్లపేట్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీమా నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఒక కుటుంబానికి బీమా నమోదు చేయడానికి ఎంత సమయం పడుతుందో స్వయంగా తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

స్థానిక అధికారులు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలందరూ ఈ పథకం కింద నమోదయ్యేలా చొరవ చూపాలని తెలిపారు. పథకంపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, వారికి అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. నమోదు ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాల వివరాలను స్పష్టంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక

రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన ఆరుష్ వర్ధన్- అభినందించిన డాక్టర్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి ఆరుష్ వర్ధన్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి, ఈ నెలలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆరుష్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ, అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలోనూ ఆరుష్ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్!

జిల్లావ్యాప్తంగా పోలీస్, వ్యవసాయ శాఖ ఆకస్మిక తనిఖీలు- ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరిక



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు.

ఇలాంటి కేసుల్లో తరచూ పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం పోలీస్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు జిల్లావ్యాప్తంగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, నిల్వలు, బిల్లులు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

గతంలో నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా పోలీస్, వ్యవసాయ శాఖలు సమన్వయంతో నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, నాణ్యతపై అనుమానాలున్నా, నకిలీ ఉత్పత్తుల విక్రయాల సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. తనిఖీల్లో పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

7,8 వార్డులలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వేములవాడ పట్టణంలోని 7, 8వ వార్డుల్లో అధికారులు ప్రారంభించారు. పథకం అమలు తీరు, అర్హతలు, అర్హులైన కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను వార్డు అధికారులు ఎల్. రోజా, రాకేష్ వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన కుటుంబాలకు ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మైలారం శ్రీనివాస్, టైలర్ శ్రీనివాస్, 7, 8వ వార్డుల ఆర్పీలు ఎల్. లావణ్య, ఎం. ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 196 మందికి జరిమానా

రూ.6.30 లక్షల ఫైన్.. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 196 మందికి న్యాయస్థానం రూ.6,30,000 జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ అనంతరం కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ మేఘన జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే తమ కుటుంబాలతో పాటు ఇతరుల కుటుంబాల్లోనూ విషాదం నింపినవారవుతారని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యసాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పీఎం రహత్, రహ్‌వీర్ పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.